ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | శుక్రవారం | 10.07.2026 | సంపుటి : 2 | సంచిక : 09 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్

## ఆపన్నహస్తం వేళ.. 'పాస్‌పోర్ట్‌ల రంగు'ను
# భారత్ చూడదు
### మెల్‌బోర్న్ మీట్స్‌లో ప్రధాని మోదీ



విదేశాలకు ఆపన్నహస్తం అందించేటప్పుడు ఆ పాస్‌పోర్ట్‌ల రంగును భారత్ చూడదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అందుకే భారత్‌పై ప్రపంచ దేశాలు అపార విశ్వాసాన్ని ఉంచుతున్నాయని అన్నారు. ఇటీవల భూకంపంతో కకావికలమైన వెనెజువెలాలో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ అమిస్తాద్'ను మోదీ ప్రస్తావించారు. ఆస్ట్రేలియాలో 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన.. ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ ముందుకెళ్తోందన్నారు. 02

## విద్యార్థుల నుంచి ఎలాంటి
# ఫీజుల వసూలొద్దు

- వచ్చే నెల 20 వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయి
- కాలేజీలు అడ్మిషన్లను యథావిధిగా కొనసాగించాలి
- 'ద్వితీయ, తృతీయ, నాలుగో'విద్యార్థులూ వివరాలివ్వాలి
- ఈ నెల 31లోగా ఈ విద్యార్థుల ఫీజు చెల్లించాలన్న హైకోర్టు
- కొత్త అడ్మిషన్ల ఫీజు చెల్లింపునకు ఆగస్టు 15 వరకు గడువు విధింపు

02






## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్
# తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్
### రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 9 : మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ. 7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్-1ఏ, జోన్-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూ ఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ. 7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ. 4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా.. మిగతా .2,845.12 కోట్లు రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ విధానంలో నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ నియామకానికి సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్
# ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
### దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు

- తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు
- హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు
- ఇండియాస్ నెక్స్-జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సీఎం రేవంత్ రెడ్డి




2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగు తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు.

హైదరాబాద్, జూలై 9 : యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ -మిగతా 2 లో..



## వేరే పార్టీల వారిని
# చేర్చుకోండి

- స్థానిక సమస్యలపై పోరాడాలి
- అప్పుడే ప్రజల్లో తమ కోసం భాజపా నేతలు ఉన్నారనే విశ్వాసం కలుగుతుంది
- పార్టీ శ్రేణులకు కేంద్ర మంత్రి జేపీ నడ్డా నిర్దేశం

హైదరాబాద్, జూలై 9 : బీజేపీలోకి ఇతర పార్టీల వారిని చేర్చుకునేందుకు తలుపులు తెరవాలని రాష్ట్ర పార్టీ నేతలకు కేంద్ర ఆరోగ్య, రసాయనాలు--ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా సూచించారు. వేరే పార్టీలకు చెందిన వారిని కలుపుకుంటేనే బీజేపీ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. రాష్ట్ర పార్టీ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేలా చూడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో -మిగతా 2 లో..

## బీఆర్ఎస్ ఖాతాలోని
# 1400 కోట్లు పంచాలి
### అమరుల కుటుంబాలకు పంచి నిజాయితీ చాటాలి
### టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్



భద్రాద్రికొత్తగూడెం, జూలై 9 : బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లు అమరుల కుటుంబా లకు పంచాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆ డబ్బు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చింది కాదా?అని ప్రశ్నించారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెంలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా -మిగతా 2 లో..

## బండి భగీరథ్‌కు
# షరతులతో కూడిన బెయిల్
### దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం



హైదరాబాద్,జూలై9 : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయ స్థానం.. దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ -మిగతా 2 లో..

## హాట్ టాపిక్‌గా
# కాంగ్రెస్ పంచాయితీ

- కొండా వర్సెస్, కడియం అన్నట్లుగా పరిస్థితులు
- మంత్రి పనితీరుపై కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి



02



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

## హరీష్ రావుపై కేసీఆర్‌కు
# నమ్మకం లేదు

- అందుకే మంత్రి పదవికి దూరం పెట్టారు
- ఎల్‌నినోపై కార్యాచరణ చేపడతున్నాం
- సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్



02

## కాంగ్రెస్ ఇక పుంజుకునే
# అవకాశం లేదు
### సీఎం సొంత సర్వేలోనూ వ్యక్తమైన ప్రజావ్యతిరేకత!
### ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ ఖాతాలో 78 సీట్లు
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు



హైదరాబాద్, జూలై 9 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పని ఇక అయిపోయినట్లేనని, సీఎం రేవంత్‌రెడ్డి చేయించుకున్న సొంత సర్వేలోనూ ఇదే విషయం తేలిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సర్కారు జారుడు బండపై నిల్చుందని, పుంజుకునే అవకాశమే లేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసంలో గురువారం భారాస గ్రేటర్ హైదరాబాద్ నేతలతో కేటీఆర్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "సగం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో రాష్ట్రంలో పరిపాలన, సొంత నాయకత్వంపై సీఎం విస్తృత -మిగతా 2 లో..



## జల్లికట్టులో
# తీవ్ర విషాదం
### ఎద్దు పొడవడంతో ముగ్గురు దుర్మరణం

చెన్నై, మార్చి 2 :శివగంగై జిల్లాలో ఏర్పాటు చేసిన జల్లికట్టులో తీవ్ర విషాదం నెలకొంది. సోమవారం జరిగిన ఈ క్రీడలో ఎద్దు పొడవడంతో ముగ్గురు -మిగతా 2 లో..




## ఆపన్నహస్తం వేళ.. 'పాస్‌పోర్ట్‌ల రంగు'ను
# భారత్ చూడదు

### మెల్‌బోర్న్ మీట్స్‌లో ప్రధాని మోదీ

**వెనెజువెలా :** విదేశాలకు ఆపన్నహస్తం అందించేటప్పుడు ఆ పాస్‌పోర్ట్‌ల రంగును భారత్ చూడదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అందుకే భారత్‌పై ప్రపంచ దేశాలు అపార విశ్వాసాన్ని ఉంచుతున్నాయని అన్నారు. ఇటీవల భూకంపంతో కకావికలమైన వెనెజువెలాలో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ అమిస్తాద్'ను మోదీ ప్రస్తావించారు. ఆస్ట్రేలియాలో 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన.. ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ ముందుకెళ్తోందన్నారు. రెండో అతిపెద్ద 5జీ మార్కెట్‌గా భారత్ మారిందని, మేడిన్ ఇండియాలో భాగంగా 6జీ దిశగా పయనిస్తోందన్నారు. చిప్‌ల నుంచి షిప్పుల వరకు.. తయారీ రంగాన్ని సరికొత్త రీతిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. "మెల్‌బోర్న్ పర్యటనతో నా కల నెరవేరింది. ఇక్కడ అద్భుతమైన ఆతిథ్యం లభించింది. 12 ఏళ్లలో మూడుసార్లు ఆస్ట్రేలియాలో పర్యటించానంటే ఇరు దేశాల మధ్య సంబంధాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. ఇందులో ప్రవాస భారతీయులది కీలక పాత్ర. మెల్‌బోర్న్‌ను మినీ ఇండియాగా పిలుస్తారు. ఈ ప్రాంతం భారతీయ సంస్కృతితో నిండి ఉంది. పాలు ఆస్ట్రేలియావైనా చాయ్‌లో మాత్రం భారతీయత ఇమిడి ఉంటుంది. పప్పు, కూరగాయలు ఆస్ట్రేలియావైనా భారత మసాలాలతోనే వంట. 'గ్రోమోర్, అచీవ్ మోర్' నినాదంతో ముందుకెళ్లాలి" అని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్ర శిబిరాలను నామరూపాల్లేకుండా చేశామని, ఆ ప్రతిధ్వని ప్రపంచం మొత్తం వినిపించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో ఎంతో పురోగతి సాధిస్తోన్న భారత్.. సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటుకు సిద్ధమవుతోందన్నారు. ఒక లక్ష్యం పూర్తయితే మరో సంకల్పం తీసుకొని ముందుకెళ్తామని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతుందన్నారు. ఇదిలాఉంటే, మార్వెల్ స్టేడియంలో నిర్వహించిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో దాదాపు 30వేల మంది ప్రవాస భారతీయులు పాల్గొని 'మోదీ మోదీ నినాదాల'తో హోరెత్తించారు.

# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల
# ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ. ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరమని సీఎం అభిప్రాయ పడ్డారు. యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు అడ్వాన్స్‌డ్




ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్న సీఎం.. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు నిర్మించి అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు చేసిన త్యాగాల వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని సీఎం కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సీతారాంపూర్‌లో నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి త్వరలో మరోసారి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల సహకారంతో తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## విద్యార్థుల నుంచి ఫీజుల వసూలొద్దు

**హైదరాబాద్:** ఫీజు వసూలు, రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి జీవో నంబర్--9లోని నాలుగు మార్గదర్శకాలపై ఇచ్చిన స్టేను హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. 2026--27 విద్యాసంవత్సరానికి విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయవద్దని స్పష్టం చేసింది. ఆగస్టు 15 వరకు అడ్మిషన్ల (తొలి ఏడాది) విద్యార్థుల ఫీజులు చెల్లిస్తామని.. ఈ నెలాఖరులోగా ఇతర సంవత్సరాల విద్యార్థుల ఫీజులు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఈ మేరకు ఉపశమనం ఇచ్చింది. ప్రవేశాలు యథావిధిగా కొనసాగించాలని కాలేజీలకు చెప్పింది. ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం విద్యార్థుల వివరాలను వారం రోజుల్లో సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. అనంతరం ప్రభుత్వం నిధుల విడుదల చర్యలు చేపట్టి.. జూలై 31లోగా ఫీజు చెల్లించాలని పేర్కొంది. ఇక మొదటి ఏడాది విద్యార్థులకు ఆగస్టు 15 డెడ్‌లైన్ విధించింది. ఆలోగా తొలిదశ ఫీజు చెల్లించాలని తేల్చిచెప్పింది. ఆ తర్వాత కాలేజీలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకోవడానికి వెసులుబాటు ఇచ్చింది. గురువారం సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణ వచ్చే నెల 20కి వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 6న జారీ చేసిన జీవో 9ను సవాల్ చేస్తూ 100కుపైగా కాలేజీలు హైకోర్టును ఆశ్రయించాయి. ఇది గత ఏప్రిల్‌లో హైకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధమని పేర్కొన్నాయి. విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. జీవో నంబర్ 9లోని నాలుగు పేరాలపై గత నెల స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రవేశాలు ప్రారంభమైన నేపథ్యంలో స్టే ఎత్తివేయాలని కోరుతూ ప్రభుత్వం వెకేట్ స్టే పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది.



## బీఆర్ఎస్ ఖాతాలోని
# 1400 కోట్లు పంచాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మా పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా ఫిర్యాదులు ఇచ్చారు. టీఆర్ఎస్ పేరు నాకు రాకుండా కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి నీతినియమాలు అంటూ ఏమీ లేవా? తల్లి, చెల్లి అనే సభ్యత మరిచి పార్టీ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. నా కంఠంలో ప్రాణముండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లను. నా పోరాటాలు ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, భాజపా చేతులు కలిపాయని ఆరోపించారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రోకో కింద కేటీఆర్ అక్రమ పర్మిషన్లు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్‌రావు అనకొండ. బీఆర్ఎస్ పార్టీ ఇంకా ఆయన్నే ముందు పెడుతోంది. ఆ పార్టీ ఈ జన్మలో బాగుపడదు.. అధికారంలోకి రాదు. పెద్దాయనకు మరకలు అంటించిన ఆయనకు 3 నెలలు మంత్రి పదవి కావాలంట. కేటీఆర్ ఇటీవల రూ.188 కోట్లతో ఓ ఇంగ్లిష్ పత్రిక కొన్నారు. ఫీనిక్స్ సంస్థకు రూ.80వేల కోట్ల విలువైన భూముల కట్టబెట్టారు. ఆ సంస్థ రూ.33 లక్షల టన్నుల కలప కొట్టేస్తోందని కవిత ఆరోపించారు.

## సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి

### 20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్షకు కవిత నిర్ణయం

**భద్రాద్రికొత్తగూడెం, జూలై 9 :** తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఏరియాలోని పీవీకే5 భూగర్భగనిని సందర్శించారు. గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. 'సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్ష చేపడతాం. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలి. కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర శాసన సభలో నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలి. కార్మికులకు హెచ్ఎంఎస్ ఎప్పుడూ అండగా ఉంటుంది. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాల్సి ఉండగా.. నామమాత్రపు జీతాలు ఇస్తున్నారని కవిత మండిపడ్డారు.

# వేరే పార్టీల వారిని చేర్చుకోండి

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ కచ్చితంగా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. 'మీరు కష్టపడి పనిచేయండి మీతోపాటు మేము ఉంటాం. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలను ప్రతి ఒక్కరూ అభిమానిస్తారు. మీ నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని అభిమానించేంతలా చూసుకోవాలి. కార్యకర్తలతో మంచిగా ఉండండి. వారితో మంచిగా లేకుంటే మీరు డిస్‌కనెక్ట్ అవుతారు'అని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు తమకు సమాచా రం ఉందన్నారు. గురువారం రాష్ట్రానికి వచ్చిన నడ్డా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశమైనప్పుడు ఈ కీలక వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. 'ఇప్పటికే ఒకసారి మన బస్సు (అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి) మిస్సయింది. ఇంకోసారి బస్సు మిస్ కానివ్వకండి. వేర్లు లేని చెట్ల లాగా మారకండి. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వ్యతిరేకతే మనల్ని గెలిపిస్తుందనే భావనతో ఉండకండి. సొంతంగా పార్టీ గెలిచేందుకు మనం ఏం చేస్తున్నాము అనేది కూడా చాలా ముఖ్యం. నేను అవినీతికి పాల్పడను. ఇంకొకరిని అవినీతి చేయనివ్వను అన్న ప్రాథమిక సూత్రంతోనే మోదీ విజయం సాధించారు. మన మంతా కూడా మోదీ పేరు చెప్పుకొని గెలుస్తున్నా...సొంతంగా గెలుపు కోసం అనుసరించబోయే కార్యాచరణ ఉందా ? మీ అంత మీరు గెలిచేందుకు ఏం చేస్తున్నారు? ఆత్మవిమర్శ చేసుకోండి. అవినీతితో పోరాడడంతోపాటు ఎల్లప్పుడూ ప్రజల పక్కనే చేదోడువాదోడుగా నిలిస్తే తప్పకుండా వారు ఆదరిస్తారు. మీ మీ కార్యక్షేత్రాలను వదలకుండా కష్టపడి పనిచేయాలి. లీడర్ల వెంట తిరిగినంత మాత్రాన లీడర్లు కాలేరు. రేపు కాంగ్రెస్ నేతలను (హిమాచల్‌లో) కలవడానికి వెళుతున్నాను. ఎందుకంటే వారిని కలిస్తే వారు మనవారు



అవుతారు'అని నడ్డా దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డా.కె.లక్ష్మణ్, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీనేతలు పొంగులేటి సుధాకరరెడ్డి, గరికపాటిమోహన్‌రావు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, శాంతికుమార్, చింతల రామచంద్రా రెడ్డి బండారు విజయలక్ష్మి, లంకెల దీపక్‌రెడ్డి, కప్పర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రభుత్వం ఏటీఎంగా మారిందని, అదే ప్రభుత్వం కొనసాగాలా? మారాలా? అన్నది రాష్ట్ర ప్రజలు నిర్ణయం తీసుకోవాలని జేపీ నడ్డా పిలుపునిచ్చారు. గురువారం ఓ హోటల్‌లో ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం--దౌత్యం--అభివృద్ధి'అంశంపై నిర్వహించిన మేధావుల గోష్టిలో నడ్డా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్‌ను అంతర్గతంగా బలోపేతం చేస్తూనే, ప్రపంచవ్యాప్తంగా దేశ గౌరవాన్ని శిఖరాగ్రానికి చేర్చిన ఘనత ప్రధాని మోదీదని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్‌సీయూ వీసీ జె.అనురాధ, ఇఫ్లూ వీసీ ప్రొ.నాగళ్లపల్లి నాగరాజ్ ప్రసంగించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, వివిధరంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇక పుంజుకునే అవకాశం లేదు

(మొదటిపేజీ తరువాయి)

సర్వే చేయించుకున్నారు. అందులో ప్రజావ్యతిరేకత చాలా స్పష్టంగా వెల్లడైంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే భారాస సుమారు 78 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ సర్వేలో తేలింది. రెండు మీడియా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర నిఘా విభాగాల సర్వేల్లోనూ ఇదే విషయం వ్యక్తమైంది. ప్రజలు కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నట్లు వాటిలో స్పష్టమైంది. ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయకపోవడంతో తెలంగాణలోని సబ్బండవర్గాలు కాంగ్రెస్ పాలనపై నమ్మకం కోల్పోయాయి. ప్రత్యామ్నాయంగా భారాస కావాలని కోరుకుంటున్నాయి. భాజపా లాంటి ఇతర పార్టీలకు అవకాశం ఇవ్వడానికి ప్రజలు ఏమాత్రం సిద్ధంగా లేరు" అని స్పష్టంచేశారు. హైదరాబాద్ పరిధిలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)పై ప్రత్యేక దృష్టి సారించాలని నేతలకు కేటీఆర్ సూచించారు. "రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. బీఎల్‌వోలకు సరైన శిక్షణ, తగిన సౌకర్యాలు కల్పించకపోవడంతో జీహెచ్ఎంసీలోనూ ప్రక్రియ నెమ్మదించింది. స్థానిక ఎమ్మెల్యేలు మరింత చురుగ్గా వ్యవహరించాలి. పార్టీ నియమించిన బూత్ స్థాయి సహాయకుల సహకారంతో అర్హులైన ఏఒక్కరి ఓటు పోకుండా చూడాలి. భాజపా, కాంగ్రెస్ పార్టీలు ఇతర ప్రాంతాల వారిని ఆయా నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు చేయించే ప్రయత్నాలు చేస్తున్నాయి. అప్పుడు భారాస మద్దతుదారుల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదముంది. ఈ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ దృష్టికి పార్టీ తరఫున తీసుకెళుతున్నాం" అని ఆయన వివరించారు. సమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, పద్మారావు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు రమణ, సురభి వాణిదేవి, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఈ సమావేశానికి గైర్హాజరవడం కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారింది.

## హాట్ టాపిక్‌గా కాంగ్రెస్ పంచాయితీ

**వరంగల్, జూలై 9 :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు జిల్లాలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పుడు కొండా వర్సెస్ కడియం లాగా పరిస్థితి మారింది. కొండా తీరుపైనా స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. దేవాలయాలను గాలికి వదిలేశారని, అన్యాక్రాంత భూములపై చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్‌లోనే విమర్శలు ఉన్నాయి. ఇకపోతే తాజా వివాదం టీపీసీసీ దృష్టికి చేరాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను బుధవారం కలిసి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై తనకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించారని, ఇది ప్రభుత్వ ప్రోటోకాల్‌కు విరుద్ధమని కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. ఇదే విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, గ్రూపు రాజకీయాలపై పార్టీ ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోందని చెప్పారు.

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.




# హరీష్ రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేదు

### అందుకే మంత్రి పదవికి దూరం పెట్టారు

### ఎల్‌నినోపై కార్యాచరణ చేపడతున్నాం

### సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, జూలై 9 :** ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్‌రావుకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీలో డ్యామేజీల మరమ్మతులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరుతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా తాము సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లాల వారీగా కార్యాచరణకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి పరిస్థితినీ ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు. గ్రామసభల ద్వారా ఎల్‌నినోపై చైతన్యం కల్పిస్తామన్నారు. శాస్త్రవేత్తల సూచనలతో పంటల ఎంపిక చేసుకోవాలని, ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ల నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగునీటి వినియోగం శాస్త్రీయంగా నిర్వహిస్తామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో నిరంతరం సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వదంతులను నమ్మొద్దని.. అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్చువల్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు.

# సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న బిజెపి, కాంగ్రెస్‌లు

- సింగరేణి ఆరోపణలపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోదు
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు కొప్పుల, బాల్క సుమన్ విమర్శలు




**హైదరాబాద్, జూలై 9 :** సింగరేణిలో రాష్ట్రప్రభుత్వం వాటా 51 శాతం.. కేంద్ర ప్రభుత్వ వాటా 49 శాతం ఉందని.. బీజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని నిర్వీర్యం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వారు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణిని లాభాల బాట పట్టించాం.. సింగరేణిలో కారుణ్య నియామకాలను కేసీఆర్ ఇచ్చారు.. జీవో 76 క్రింద వేలాది కుటుంబాలకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంలో కేసీఆర్ కృషి ఉంది. గనుల వేలానికి సంబంధించిన ఎంఎంటీఆర్ బిల్లును నేను ఎంపీగా వ్యతిరేకించా..బీఆర్ఎస్ ఆ చట్టానికి వ్యతిరేకంగా లోక్‌సభ నుంచి వాకౌట్ చేసింది.. సింగరేణిని వేలం పాట పెడితే సింగరేణి నష్టపోతుందని ఆనాడే రాజ్యసభలో మా పార్టీ తరపున ఆనాడు కేశవరావు మాట్లాడిండు. సింగరేణి బొగ్గు బావులను వేలం వేయొద్దని ప్రధాని మోడీకి కేసీఆర్ లేఖ రాశారు. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణిని సిరుల గనిగా ఉంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సింగరేణిలో కుంభకోణాలకు అడ్డాగా మారిపోయిందని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ తో టెండర్ లో కుంభకోణం చేశారు. 42 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు 16 వందల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని బాల్క సుమన్ అన్నారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో సింగరేణిలో మొత్తం 16 వేల కోట్ల కుంభ కోణాలు జరిగాయన్నారు. మా నాయకుడు హరీష్ రావు బొగ్గు నిల్వల చూసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ వచ్చిన తరువాత సింగరేణిలో డీజిల్ కుంభకోణానికి తెరలేపారు. పంపకాల విషయంలో ముఖ్యమంత్రి మంత్రుల మధ్య పంచాయతీ రావడంతో ,ఆ తర్వాత నైని బొగ్గు బ్లాక్ టెండర్ ను రద్దు చేశారు .బడే బాయ్, చోటే బాయ్ మధ్యలో మిడిల్ బాయ్ కిషన్ రెడ్డి .అందరు కలిసి సింగరేణిని ముంచుతున్నారని ఫైర్ అయ్యారు. తాడిచర్ల బొగ్గు బ్లాక్ 2ను సాధించామని బీజేపీ, కాంగ్రెస్ గొప్పలు చెప్పుకుంటున్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే ఆగమేఘాల మీద కేంద్ర బృందాన్ని పంపారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలపై కేంద్ర బృందం ఎందుకు రావడం లేదు. ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి సింగరేణిలో వందల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడుతున్నారు. ఆధారాలతో సహా మా నాయకుడు హరీష్ రావు సింగరేణి కుంభకోణం బయటపెడితే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డి బాయి బాయి అందుకే సింగరేణిలో కుంభకోణాలకు పాల్పడుతున్నారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతి కిషన్ రెడ్డికి ఎందుకు కనిపించడం లేదు. అన్ని ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులను సింగరేణి సంస్థకే అప్పగించాలని మేము డిమాండ్ చేస్తున్నాము. ఓపెన్ కాస్ట్ బొగ్గు బ్లాక్ లను నామినేషన్ పద్ధతిలో సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము.

## మందుల సామేలుకు వ్యతిరేకం కాదు

- ఇద్దరం కూడా కాంగ్రెస్ కార్యకర్తల సపోర్ట్‌తో గెలిచాం
- పార్టీ నియామకాల అంశాన్ని పిసిసి దృష్టికి తీసుకెళ్లా
- భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, జూలై 9 :** మందుల సామేలుకు నేను వ్యతిరేకం కాదు..ఆయన తీసుకున్న నిర్ణయాలను కూడా వ్యతిరేకించడం లేదు..ఇద్దరం కూడా కాంగ్రెస్ కార్యకర్తల సపోర్ట్‌తో గెలిచాం. పార్టీ నియామకాల అంశాన్ని పిసిసి దృష్టికి తీసు కెళ్లానని, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. తుంగతుర్తి నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ పరిణామాలపై చామల కిరణ్ రెడ్డి స్పందించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. గురువారం ఎంపీ చామల మీడియాతో మాట్లాడుతూ.. తుంగతుర్తి నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య మనస్పర్థలు వచ్చినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్‌కు, ఎంపీగా తనకు ఎలాంటి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ లేదని, అయినా కాంగ్రెస్ కార్యకర్తలు అక్కున చేర్చుకుని గెలిపించారన్నారు. 'నేను ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వ్యతిరేకం కాదు. నేను తుంగతుర్తి నియోజకవర్గంలో మండల అధ్యక్ష పదవికి, పీఏసీఎ స్ చైర్మన్ పదవికి, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ప్రమోట్ చేయలేదు. కార్యకర్తల అభిప్రాయం మేరకు ఎవరిని కోరుకుంటే వారికే పదవులు ఇద్దామ ని మందుల సామేల్‌తో చెప్పాను. మందుల సామేల్ తీసుకునే నిర్ణయానికి నేను వ్యతిరేకం కాదు. నేను విదేశాల్లో ఉన్నప్పుడు మండల అధ్యక్షులను ప్రకటించారు. దీనిపై నాకు కాంగ్రెస్ కార్యకర్తలు ఫోన్ చేశారు. ఇదే అంశా న్ని నేను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకువెళ్లాను. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత మండలం తిరుమలగిరి, నా సొంత మండలం శాలి గౌరారం తుంగతుర్తి లోనే ఉన్నాయి. సూర్యాపేట, యాదాద్రి, భువనగిరి డీసీసీ అధ్యక్షులు, పార్లమెంట్ అబ్జర్వర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తామని చెప్పాను. మండల స్థాయిలో కార్యకర్తలు.. ఎవరికి ఎక్కువగా మద్దతు ఇస్తే వారికే అవకాశం ఇద్దాం. పదవుల కోసం రోడెక్కి కొట్టుకుంటే ప్రజల్లో చులకన అవుతాము. తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ కేడర్ సమన్వయం పాటించాలి. మనకు పదవులు వచ్చాయి. మన గెలుపు కోసం పని చేసిన కేడర్‌ను పట్టించుకోవా లి. ప్రజలు నమ్మకంతో మమ్మల్ని గెలిపించారు. అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మాపైన ఉంది' అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు.

## బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

**సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో కేసీఆర్ నిర్ణయం**

**హైదరాబాద్, జూలై 9 :** రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవి చంద్ర ఫ్లోర్ లీడర్ గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడుగా, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ముగియడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల, తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.

## స్పీకర్, మండలి చైర్మన్‌తో సీఎస్ సంజయ్ జాజు భేటీ

**హైదరాబాద్, జూలై 9 :** తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**నిజామాబాద్, జూలై 9 :** నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెలుగు చూసింది. స్థానిక పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసముండే ఎం జగదీష్ (60) అనే వ్యక్తి గత రెండు రోజులుగా ఇంటి తలుపులు తెరవకపోవడంతో ఇంట్లోంచి దుర్వాసన వస్తుందని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారు డయల్ 100కు ఫోన్ చేసి సమాచామందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలోని, బ్లాక్ నెంబర్ 13/2లో పై అంతస్తులు ఉండే జగదీష్ ఇంటి తలుపులను లోబడి నుండి పెట్టుకొని ఉండడంతో పోలీసులు స్థానికుల సహాయంతో డోర్లను తెరిచి చూశారు. ఆ ఇంట్లో మొదటి గదిలో ఆయన ఫ్యాన్ కు ఉరివేసుకొని వేలాడుతూ ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య గత కొంత గీతం చనిపోవడం, అప్పటి నుండి ఆయన ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నట్లు చుట్టుపక్కల వారు తెలిపారు. ఆయన ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని మృతుడి తమ్ముడైన మహేందర్ కు పోలీసులు ఫోన్ చేసి సమాచారమందించారు. అయితే ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆయన ఆత్మహత్యకు పాల్పడాల్సిన అవసరం ఏమిటన్న విషయం తెలియ రాలేదు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు నాలుగో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# తాడిచర్ల–2 కేటాయింపు కిషన్‌రెడ్డి కృషి ఫలితమే

- యూపీఏ హయాంలో కేటాయింపు అవాస్తవం
- భట్టి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే పాయల శంకర్



**న్యూఢిల్లీ, జూలై 9 :** తాడిచర్ల–2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్అన్నారు. యూపీఏ–2 ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాడిచర్ల–2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలేకపోయిందని విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాల తో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

## సాయికృష్ణ లాకప్ డెత్ కేసు

- సీఐ నాగరాజు కస్టడీపై హైకోర్టు షరతులకు సుప్రీంకోర్టులో సిట్ సవాల్
- సమగ్ర విచారణకు పరిమితులు అడ్డుగా మారుతున్నాయన్న సిట్
- షరతులు సడలించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన దర్యాప్తు బృందం
- మూడు వారాలకు కేసు విచారణ వాయిదా వేసిన హైకోర్టు



**అమరావతి, జూలై 9 :** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన సాయికృష్ణ లాకప్ డెత్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడైన సీఐ నాగరాజు కస్టడీ విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విధించిన షరతులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సుప్రీంకోర్టులో సవాలు చేసింది. సమగ్ర దర్యాప్తు నిర్వహించేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న పరిమితులు ఆటంకంగా మారుతున్నాయని పేర్కొంటూ, ఆ షరతులను సడలించాలని సిట్ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం సీఐ నాగరాజును ఒక రోజు మాత్రమే కృష్ణలంకలో విచారించేందుకు అనుమతి ఇచ్చింది. మిగిలిన ఏడు రోజుల కస్టడీ విచారణను రాజమండ్రి సెంట్రల్ జైలులోనే నిర్వహించాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా మొత్తం విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రూపంలో రికార్డు చేయాలని కూడా ఆదేశించింది. అయితే ఈ నిబంధనల కారణంగా కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ చేపట్టడం కష్టసాధ్యమవుతోందని సిట్ వాదిస్తోంది. నిందితుడిని వివిధ ప్రదేశాలకు తీసుకెళ్లి ఆధారాలు సేకరించడం, సంఘటనల పునర్నిర్మాణం వంటి దర్యాప్తు చర్యలకు ప్రస్తుతం ఉన్న పరిమితులు అడ్డంకిగా మారుతున్నాయని పేర్కొంటూ, హైకోర్టు విధించిన షరతులను సవరించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదిలా ఉండగా, సాయికృష్ణ లాకప్ డెత్ కేసు దర్యాప్తు పురోగతిపై స్టేటస్ రిపోర్టును సీల్డ్ కవర్‌లో సమర్పించాలని బుధవారం సిట్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. కేసుకు సంబంధించిన తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ కేసులో సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయంతో పాటు హైకోర్టులో జరగనున్న తదుపరి విచారణపై కూడా ఆసక్తి నెలకొంది.



## 11న ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

**యాదగిరిగుట్ట, జూలై 9 :** ఈనెల 11న యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భవాని శంకర్ వెల్లడించారు. గురువారం ఈవో కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తిరుమల తరహాలో ఆలయంలోని బంగారు వాకిలి వద్ద ఉదయం 11 .37 గంటలకు ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. అనంతరం ప్రెసిడెంట్ సూట్‌లో ట్రస్ట్ బోర్డ్ మొదటి సమావేశం జరుగుతుందని వివరించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా ఎం సత్యనారాయణ రెడ్డి , మరో ముగ్గురు సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి మీడియాకు అనుమతి లేదన్నారు. స్వీకారో త్సవం నిరాడంబరంగానే కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులకు ఎవరికి ఆహ్వానం అందజేయలేదని ఈవో వెల్లడించారు. ఒకవైపు దేవస్థానం అధికారులు ఆహ్వాన పత్రికను వీఐపీలకు అందజేస్తూనే మరోవైపు ఎవరికి ఆహ్వానం లేదనడంపై విచిత్రంగా ఉందని స్థానికులు ఆరోపించారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

**సిఎంతో చర్చిస్తానని డిప్యూటి సిఎం భట్టి హామీ**



**ఖమ్మం, జూలై 9 :** సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ గురువారం చింతకాని మండలం లచ్చగూడెంలో సమర్పించిన వినతిపత్రంపై భట్టి సానుకూలంగా స్పందించారు. శుక్రవారం జగన్నాథపురం లో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి హాజరవుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. దీనిపై స్పందించిన భట్టి విక్రమార్క.. సొసైటీల ద్వారా స్థలాల కేటాయింపులో న్యాయపరమైన చిక్కులు ఉన్నందున, వాటికి అతీతంగా వ్యక్తిగతంగా, బీపీఎల్ కోటా లేదా ఇతర విధానాల ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే మార్గాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రంలో టీడబ్ల్యూజేఎఫ్ నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అధిక సంఖ్యలో జర్నలిస్టులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని, తక్కువ వేతనాలతో అదె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గత, ప్రస్తుత ప్రభుత్వాల దృష్టికి పలుమార్లు విజ్ఞప్తులు చేయడంతో పాటు ఉద్యమాలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం వెలుగుమట్ల వీవీ పాలెం రెవెన్యూ పరిధిలో 23 ఎకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేసినప్పటికీ, అది అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కొన్ని న్యాయపరమైన సందిగ్ధతలు ఏర్పడినప్పటికీ, సొసైటీలతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో జాప్యాన్ని వీడి, జర్నలిస్టులకు ఏ ప్రాతిపదికన, ఎప్పటిలోగా ఇళ్ల స్థలాలు కేటాయిస్తారో నిర్దిష్టమైన గడువుతో ప్రకటించేలా ముఖ్యమంత్రితో చర్చించాలని ఉపముఖ్యమంత్రిని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, జిల్లా కమిటీ సభ్యులు రాంపుడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రావణ్ ఇంటిని తనిఖీ చేసిన ఏపీ పోలీసులు



**హైదరాబాద్ :** వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ రావణ్ అలియాస్ జోసెఫ్ ఇంటిని ఏపీ పోలీసులు తనిఖీ చేశారు. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు నిర్వహించిన తనిఖీల్లో ఎనిమిది మందితో కూడిన గన్నవరం పోలీసుల బృందం పాల్గొంది. కొన్ని దస్త్రాలు, రికార్డులు స్వాధీనం చేసుకుంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని నరేంద్రనగర్ కాలనీలో గత రెండేళ్లుగా రావణ్ ఉంటున్నట్లు సమాచారం. ఇంట్లోకి ప్రవేశించినప్పటి నుంచి ప్రతి అంశాన్ని వీడియో రికార్డు చేశారు. రావణ్ భార్యను ప్రశ్నించి పలు వివరాలు సేకరించినట్లు తెలిసింది. వివరాలు నమోదు చేసి ఆమె సంతకాలు తీసుకున్నారు. స్థానిక విలేకరులతో పాటు ఎవరినీ అనుమతించలేదు. అమీన్‌పూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అమీన్‌పూర్ డీఐ సత్యనారాయణ, ఎస్సై విజయరావుతో పాటు కొంత మంది పోలీసులు వారికి సహకరించారు. తాము కేవలం బందోబస్తు మాత్రమే నిర్వహించామని పూర్తి వివరాలు తెలియవని స్థానిక పోలీసులు తెలిపారు.

# గందరగోళంలో వ్యవసాయం



**ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన మరింత ఎక్కువయ్యింది. తాగు,సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడబోతున్నాయి. ఈయేడు సాగు సాగడమెలా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. జులై మధ్యలోకి వచ్చినగా గట్టి వర్షాలు లేవు. దీంతో వరిసాగు సాగదని రైతులే చెబుతున్నారు. నారు ఎండిపోతోంది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు గోదావరిలో కొత్తో గొప్పో నీళ్లు వస్తున్నాయి తప్ప, కృష్ణా పివాహక పూర్తిగా ఎండిపోయినట్లే. ఇప్పటికే వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లతో సతమతమవుతోంది.**

దేశానికి అన్నం పెట్టే రైతు అనేక సమస్యలమధ్య జీవన పోరాటం సాగిస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, పెరు గుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. రైతుకు ప్రకృతి శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు ఆకాల వర్షాలు, వరదలు, వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతున్నాయని అనుకుంటే ఇప్పుడు ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగా మారింది. రైతు ఎంత కష్టపడి పంట పండించినా ప్రకృతి వైపరీత్యాలు అతని ఆశలను ఆవిరి చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభ మైన వ్యవసాయరంగం ప్రస్తుతం అనేక సవాళ్లతో కొట్టు మిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుండి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. రైతు పెట్టుబడి పెట్టే కాలం నుండి పంట చేతికి వచ్చే వరకు అంతా ప్రకృతి చేతుల్లోనే ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల ఒక ఏడాది తీవ్రమైన కరువు ఏర్పడితే, మరో ఏడాది అకాల వర్షాలు, తు ఫానులు, వరదలు పంటలను ముంచెత్తుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడం తో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది.

ఎల్‌కనినో తట్టుకునేలా రైతులకు అత్యవసర సాయానికి ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి. ఇకపోతే వ్యవసాయంలో పెట్టు బడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. పంటదిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. దీంతో అప్పులు చేయడం తప్ప రైతుకు మరో మార్గం కనిపించడం లేదు. పంటించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ధాన్యం కొంటారన్న గ్యారెంటీ లేదు. దీనికితోడు నకిలీ విత్తనాల సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. అధిక దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయించే నకిలీ విత్త నాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు దెబ్బతిన డంతో రైతు కుదేలవుతున్నాడు. మరోవైపు ఎరువుల కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సీజన్ సమయంలో ఎరు వుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరి స్థితి ఏర్పడుతోంది. అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. నేడు వ్యవసాయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. కూలీల ఖర్చులు, ట్రాక్టర్ల అద్దెలు, డీజిల్ ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్టుబడి రెట్టింపవుతున్నా దానికి తగ్గట్టుగా పంటకు మద్దతుధర లభించడం లేదు. మార్కెట్ల లో దళారుల వ్యవస్థ, సిండికేట్లుగా మారిన వ్యాపారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు.

ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుది. పెట్టుబడులు పెరిగి, పంట చేతికిరాక, వచ్చిన పంటకు సరైన ధర దక్కకపోయేసరికి రైతు పూర్తిగా అప్పుల్లో మునిగిపోతాడు. బ్యాంకుల నుండి రుణాలు దొరకని చిన్న, సన్న కారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. వారు విధించే చక్రవడ్డీలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక సమాజంలో గౌరవం కోల్పోతామనే భయంతో ఎంతో మంది రైతులు పురుగుల మందుతాగి తనువు చాలిస్తున్నారు. ఇంకొందరు ఉరివేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రుణాల విధానం సక్రమంగా లేకపోవడంతో బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. వంట నష్టాలు, ఆదాయం లేక పోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించా లంటే ప్రభుత్వాలు రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. న కిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకో వాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో ఉంచాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవ సాయరంగం బలోపేతం కావాలంటే రైతు బాగుండాలి. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి మూలాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో నుంచి గట్టెక్కేందుకు తగన వ్యవసాయ ప్రణాళికలు అమలు చేయాలి.



## హాస్టల్‌లో గదిలో విషాదం..

### నలుగురిని కాటేసిన పాము

**ఝార్ఖండ్ :** ఝార్ఖండ్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల బాలికల హాస్టల్‌లోకి పాము రావడం తీవ్ర కలకలం రేపింది. హాస్టల్ గదిలోకి దూరిన విషపూరిత కట్లపాము.. నిద్రలో ఉన్న నలుగురు విద్యార్థినులను కాటేసింది. ఈ ఘటనలో 13 ఏళ్ల విద్యార్థిని మృతిచెందగా, మరో ముగ్గురు బాలికలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. లోహర్‌దగా జిల్లాలోని సన్‌వసిరా హయ్యర్ సెకండరీ రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాత్రి 11 గంటల సమయంలో బాలికలు నిద్రిస్తున్న గదిలోకి వచ్చిన పాము.. తొలుత ఓ అమ్మాయిని కాటేసింది. దీంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. అదే గదిలో నిద్రిస్తున్న మరో ముగ్గురు విద్యార్థినులు లేచి చూసేసరికి వారినీ పాము కాటేసింది. వీరి అరుపులు విన్న హాస్టల్ సిబ్బంది.. వెంటనే విద్యార్థినులను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాధితుల్లో ఓ విద్యార్థిని మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మిగతా బాలికలు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు ఆసుపత్రి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఒక విద్యార్థిని ప్రాణం పోయిందని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## పీవోకేలో మిన్నంటిన ఆందోళనలు

### పాక్ ప్రభుత్వానికి జేఏఏసీ అల్టిమేటం



**న్యూఢిల్లీ :** పాక్ ఆక్రమిత కశ్మీర్ లో మరోసారి ఉద్రిక్తతలు మిన్నంటాయి. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పాక్ ప్రభుత్వానికి 'ది జమ్ముకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ' హెచ్చరికలు జారీచేసింది. 48 గంటల గడువును విధించింది. ఈలోగా స్పందించకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని పేర్కొంది. జులై 27న స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు పాక్ ప్రభుత్వం సిద్ధమైంది. ఇవాళ్టి నుంచి (జులై 9) నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ క్రమంలోనే ముజఫరాబాద్‌లో జేఏఏసీ భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. పాకిస్థాన్‌లో స్థిరపడిన కశ్మీరీ శరణార్థుల కోసం గతంలో 12 అసెంబ్లీ స్థానాలను కేటాయించారు. ఆ రిజర్వేషన్లను రద్దు చేయాలనేది జేఏఏసీ ప్రధాన డిమాండ్. ఈ స్థానాల వల్ల పాక్ ఆక్రమిత్ కశ్మీర్ రాజకీయాలపై ఇస్లామాబాద్ ప్రభావం ఎక్కువవుతోందని జేఏఏసీ వాదిస్తోంది. అక్కడి మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆయా 12 నియోజకవర్గాల్లో 4.36 లక్షల మంది ఓటర్లు ఉండగా.. పీవోకేలోని మిగతా 33 నియోజకవర్గాల్లో 33 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. స్థానిక నివాసితులకు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల కంటే.. ఈ శరణార్థులకు కేటాయించిన నియోజకవర్గాలకే ప్రాధాన్యత లభిస్తోందన్నది జేఏఏసీ వాదన. మరోవైపు గత నెలలో పాక్ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూడా ఉద్రిక్తతలకు ఆజ్యం పోసినట్లు అయింది. పీవోకేలోని 12 నియోజకవర్గాల్లో శరణార్థుల కోటాను రద్దు చేయడం కుదరదని, రాజ్యాంగ పరంగా వాటికి భద్రత కల్పించాలని జూన్ 7న సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ఇది కూడా ఆందోళనలు చెలరేగడానికి కారణమైంది. దీంతో పాటు ద్రవ్యోల్బణాన్ని తట్టుకునేందుకు వీలుగా నిత్యావసర వస్తువులపై రాయితీలు, విద్యుత్ ఛార్జీల తగ్గింపు, జలవిద్యుత్ ప్రాజెక్టులకు గుర్తింపు తదితర 38 డిమాండ్లు నెరవేర్చాలని జేఏఏసీ కోరుతోంది. స్థానిక ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో.. ఈ ఆందోళనల తీవ్రత మరింత పెరిగింది. తమ నిరసనల్లో భాగం కావాలని పీఓకే ప్రజలు, ప్రవాస కశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఇస్లామిక్ కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవహక్కుల సంఘాలను ఆహ్వానించింది.

## మరోసారి పశ్చిమాసియాలో టెన్షన్


### స్పందించిన మోదీ



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా మరోసారి దద్దరిల్లుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ తాజా పరిస్థితులపై మెల్‌బోర్న్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న అన్ని ఘర్షణలు దౌత్యం, చర్చలు ద్వారానే పరిష్కారం సాధ్యమవుతాయని పేర్కొన్నారు. మూడుదేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న మోదీ.. ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓ ఫోరమ్ లో ప్రసంగించారు. వాణిజ్యం, రక్షణ, విద్య సహా పలు అంశాలపై ఆల్బనీస్‌తో చర్చించారు. అలాగే స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కీలకమైన అణుశక్తి ఒప్పందంపై సంతకాలు చేశారు. భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం సరఫరా చేస్తుందని మోదీ వెల్లడించారు. క్రిటికల్ మినరల్ కారిడార్, డిఫెన్స్ ఇన్నోవేషన్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలను ప్రకటించారు. ఇండో-పసిఫిక్‌లో శాంతి, సుస్థిరత, స్వేచ్ఛా నౌకాయానంపై కలిసి అడుగులు వేస్తామని తెలిపారు. తాజా పర్యటన ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**క్రికెట్ పోలిక తెచ్చిన మోదీ..**

భారత్, ఆస్ట్రేలియా ప్రజలకు ఎంతో ఇష్టమైన ఆట క్రికెట్. అందుకే ఈ రెండు దేశాల మధ్య చర్చలు జరిగినప్పుడల్లా క్రికెట్ ప్రస్తావన వస్తూనే ఉంటుంది. తాజాగా కుదిరిన యురేనియం డీల్ నేపథ్యంలో ఆ భాషలోనే మన ప్రధాని మాట్లాడారు. "ప్రపంచ క్రీడా రాజధాని అయిన మెల్‌బోర్న్‌లో మనం ఈ రోజు ఉన్నాం. ఇక్కడ ఆ క్రీడల గురించి మాట్లాడకపోవడం అంటే.. టాస్ వేసిన తర్వాత కూడా క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కాకపోవడమే అవుతుంది. ఈ రెండు దేశాల సంబంధాలకు ఇదొక ప్రత్యేక దౌత్యపరమైన భాష. మన సమావేశాలు క్రికెట్ మ్యాచ్‌ల్లానే ఉంటాయి. అజెండా వన్డే మ్యాచ్‌లా, నిర్ణయాలు టీ20 అంత వేగంగా, భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత సుదీర్ఘంగా, గాఢంగా ఉంటుంది" అని మోదీ తెచ్చిన వర్ణనతో ఆడియన్స్‌అంతా క్లీన్‌బౌల్డ్ అయ్యారు. యురేనియం డీల్ కుదిరిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా మాట్లాడారు.



## ట్రంప్ మెడకు లైంగిక వేధింపుల కేసు

- దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు
- కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశం

**వాషింగ్టన్, జూలై 9 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో న్యాయపరమైన ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధిపుల కేసులో ట్రంప్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు దోషిగా తేల్చింది. రచయిత్రి, మాజీ కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు రూ.47 కోట్లు చెల్లించాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. 2023లో విచారణ జరిపిన జ్యూరీ, ట్రంప్ లైంగిక దాడికి పాల్పడినట్లు, అనంతరం క్యారల్ పరువును దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినట్లు తేల్చింది. దీంతో 5 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని అప్పుడే తీర్పు వెలువరించింది. లైంగిక దాడికి గాను 2 మిలియన్ డాలర్లు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు గాను 3 మిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ మే 2023లో కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ట్రంప్ చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. 1996లో న్యూయార్క్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూమ్‌లో తనపై ట్రంప్ లైంగిక దాడి చేశారని క్యారల్ ఆరోపించారు. ఆ విషయాన్ని 2019లో ప్రచురితమైన ఓ పుస్తకంలో క్యారల్ రాశారు. ఆ ఆరోపణలు పూర్తిగా కల్పితమని, క్యారల్ ఒక పిచ్చిదని ట్రంప్ కొట్టిపడేశారు. కాగా, ఇది ట్రంప్‌నకు సంబంధించిన ఏకైక సివిల్ కేసు కాదు. 2024లో పరువు నష్టం కేసులో క్యారల్‌కు అదనంగా 83.3 మిలియన్ డాలర్లు చెల్లించాలని మరో జ్యూరీ తీర్పు ఇచ్చింది. ఆ కేసు కూడా ప్రస్తుతం న్యాయపరమైన పక్రియలో కొనసాగుతోంది.



## అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలి : జేడీ వాన్స్

**వాషింగ్టన్ :** హెచ్-1బీ వీసా దుర్వినియోగాలకు పాల్పడే వారిపై అమెరికా చేపట్టిన చర్యలపై అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందించారు. అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలని పునరుద్ఘాటించారు. వీసా మోసాలకు పాల్పడే వారిపై అమెరికా కార్మిక శాఖ ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిందని, విచారణ నిమిత్తం కొంతమందికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. విస్కాన్సిన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వాన్స్ మాట్లాడుతూ.. "అత్యున్నత ప్రతిభ కలిగిన శాస్త్రవేత్తలు, వైద్యులు, సాంకేతిక నిపుణులు అమెరికాలో పనిచేసేందుకు వీలుగా హెచ్-1బీ వీసాను రూపొందించాం. కానీ, కొన్ని పెద్ద కంపెనీలు, వ్యక్తులు ఈ వీసా విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. తక్కువ వేతనాలతో విదేశీ ఉద్యోగులను నియమించుకుని అమెరికా కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నారు. పన్ను చెల్లింపుదారుల సొమ్ము కాపాడటంతో పాటు వీసా దుర్వినియోగాన్ని అరికట్టడమే ట్రంప్ ప్రభుత్వ లక్ష్యం. వీసా దుర్వినియోగం చేసేవారిని ఇకపై ఉపేక్షించబోం. అలాంటి వారికి అమెరికాలోకి ప్రవేశం ఉండదు. వీసా వ్యవస్థలో మోసాలను అరికట్టేందుకు కార్మిక శాఖ విస్తృత స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తోంది" అని స్పష్టం చేశారు. నైపుణ్యం కలిగిన విదేశీయులను అమెరికాలో తాత్కాలికంగా నియమించుకోవడమే హెచ్-1బీ వీసా ప్రధాన ఉద్దేశం. హెచ్-1బీ ఉద్యోగులను నియమించే సంస్థలు అమెరికా కార్మిక శాఖ నుంచి అనుమతి పొందాలి. వారి నియామకం వల్ల అమెరికా ఉద్యోగుల వేతనాలు, ఉద్యోగ పరిస్థితులు దెబ్బతినబోవని ధ్రువీకరించాలి. అమెరికా కాంగ్రెస్ ఏటా 65 వేల హెచ్-1బీ వీసాలను, అమెరికాలో ఉన్నత విద్య పూర్తిచేసిన వారికి అదనంగా 20 వేల వీసాలను అనుమతిస్తుంది. ఏటా జారీ అయ్యే హెచ్-1బీ వీసాల్లో భారతీయులే అధిక వాటా పొందడం గమనార్హం. ప్రస్తుతం అమెరికాలో సుమారు 7.3 లక్షల మంది హెచ్-1బీ వీసాదారులు, వారి కుటుంబ సభ్యులతో కలిపి దాదాపు 12.8 లక్షల మంది నివసిస్తున్నట్లు సమాచారం.

## హెచ్‌పీసీఎల్ బాట్లింగ్ ప్లాంట్‌లోకి వరద

### కొట్టుకుపోయిన 3,000 సిలిండర్లు

**రాయగఢ్ :** అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా గ్యాస్ సిలిండర్లను అతిభద్రంగా దాచుకుంటున్నాం. ఇలాంటి సమయంలో మహారాష్ట్రలో 3,000 గ్యాస్ సిలిండర్లు వరదనీటిలో కొట్టుకుపోయాయి. దానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొన్నిరోజులుగా మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలోనే రాయగఢ్ జిల్లాలోని హెచ్‌పీసీఎల్ పాతాళ్‌గంగ ఎల్‌పీజీ బాట్లింగ్ ప్లాంట్ జలమయమైంది. ఆ వరద ప్రవాహ తీవ్రతకు 3వేల వరకు సిలిండర్లు పాతాళగంగ నదిలోకి కొట్టుకుపోయాయి. వాటిలో కొన్ని ఖాళీవి కూడా ఉన్నాయి. ఒడ్డుకు కొట్టుకొచ్చిన సిలిండర్లను ఎవరూ తీసుకెళ్లవద్దని రాయగఢ్ జిల్లా కలెక్టర్ ప్రజలను కోరారు. " నదిలోకి కొట్టుకొచ్చిన సిలిండర్లలో గ్యాస్ ఉందో లేదో, సురక్షితమైన స్థితితో ఉన్నాయో లేదో చెప్పలేం. అందుకే వాటిని తీసుకెళ్లడం ప్రమాదానికి దారితీయొచ్చు" అని హెచ్చరించారు. అవి కనిపించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే వాటిని గుర్తించి, స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

## ఫ్లైట్ నుంచి దూకి ఇన్‌స్ట్రక్టర్ ఆత్మహత్య

**టొలెడా :** విమానం గాల్లో ఉండగా ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ అందులో నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి నుంచి ట్రైనింగ్ తీసుకుంటున్న విద్యార్థి అప్పుడు విమానంలో ఉన్నాడు. అర్జెంటీనాలోని టొలెడాలో జరిగిన ఈ అనూహ్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫ్లయింగ్ ప్యారెట్ కార్డోబా ఫ్లయింగ్ స్కూల్‌లో ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న లియాండ్రో ఆండ్రెస్ (42).. ఓ విద్యార్థికి ట్రైనింగ్ ఇస్తున్న సమయంలో అకస్మాత్తుగా విమానం నుంచి దూకేశారు. గతవారం జరిగిన ఈ ఘటన గురించి పోలీసులు తాజాగా ఓ ప్రకటన విడుదల చేశారు. "ఏం చేయాలో నీకు తెలుసు. ఆ ప్రకారమే నడుచుకో" అంటూ తన హెడ్‌సెట్, సీట్‌బెల్ట్ తీస్తూ ఆ స్టూడెంట్‌కు చెప్పారు. ఇలా జరుగుతుందని ఏమాత్రం ఊహించని ఆ యువకుడు తొలుత కంగుతిన్నా.. తర్వాత విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ ఘటనపై ఫ్లయింగ్ స్కూల్ డైరెక్టర్ ఎడ్వర్డో అల్వారెజ్ స్పందించారు. "అతడు ఇలా ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనతో ఉన్నాడని ఏమాత్రం ఊహించలేక పోయాం. అంతకుముందు అతడు మరో విద్యార్థికి కూడా ట్రైనింగ్ ఇచ్చారు. ఈ ఘటన మమ్మల్ని షాక్‌కు గురిచేసింది. అసలు విమానం గాల్లో ఉన్నప్పుడు డోర్ తీయడం చాలా కష్టం. ఆయన ఎంతో అనుభవజ్ఞుడైన ఇన్‌స్ట్రక్టర్" అని అన్నారు.

## అమెరికా బాంబులేసిన ఖమేనీ కాంపౌండ్ దృశ్యాలు..

### షేర్ చేసిన ఇరాన్

**టెహ్రాన్ :** అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన రోజునే అప్పటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతిచెందారు. టెహ్రాన్‌లోని కాంపౌండ్‌లో ఆయనతో పాటు ఇతర కీలక నేతల లక్ష్యంగా ఆ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఖమేనీని గురువారం సమాధి చేయనున్న నేపథ్యంలో దాడుల్లో దెబ్బతిన్న ఆ భవనం దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా షేర్ చేసింది. 35 సెకన్ల నిడివి గల ఆ వీడియోలో.. అత్యంత దారుణంగా భవనం దెబ్బతిన్న దృశ్యాలు కన్పించాయి. వారం రోజులుగా ఖమేనీ అంతిమ యాత్ర జరుగుతోంది. ఇరాన్, ఇరాక్‌లలోని వివిధ నగరాల మీదుగా ఈ అంతిమయాత్ర సాగింది. ఈ మార్గాల్లో భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు తమ నేతకు అంతిమ వీడ్కోలు పలికారు. ఖమేనీ పార్థివ దేహాన్ని ఇరాన్‌లోని ఆయన సొంత పట్టణమైన మషహద్‌లో గురువారం ఖననం చేయనున్నారు. ఈ క్రమంలో ఈ పట్టణానికి చేరుకోవడానికి ఉపయోగించే రెండు వంతెనలు అమెరికా దాడుల్లో ధ్వంసమయ్యాయి. మరోవైపు దాడుల నేపథ్యంలో టెహ్రాన్-మషహద్ మధ్య రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. అంత్యక్రియల కార్యక్రమానికి ఆటంకం కలిగించేందుకే యూఎస్ ఈ దాడులు చేసిందని ఐఆర్‌జీసీ ఆరోపించింది. ఇవి ఇలాగే కొనసాగితే.. తమ నుంచి వచ్చే స్పందన భీకరంగా ఉంటుందని హెచ్చరించింది.



# తక్కువ ఆదాయం గలవారు

# డబ్బు ఆదా చేయడం ఎలా?

చాలా మంది డబ్బు సంపాదన తర్వాత ఆదా చేయడం గురించి తమ ప్రయత్నాలు చేస్తారు. కొంత మంది చొరవ గలవారు ఎంత డబ్బు సంపాదించినా తక్కువ మెఎత్తంలోనైనా ఆదా చేయడానికి తమ వంతు కృషి చేస్తుంటారు. అధిక ఆదాయం సంపాదించేవారికి, డబ్బు ఆదా చేయడం అంత పెద్ద కష్టం కాకపోవచ్చు. కొందరికి అనుకున్నంత ఆదాయం ఉండదు. అటువంటప్పుడు ఆదా చేయడం వారికి సవాలుగానే అనిపిస్తుంది. కానీ, సరైన దూరదృష్టితో మెరుగైన విధానాలను అనుసరిస్తే ఇది సాధ్యమే అంటున్నారు నిపుణులు.

## బడ్జెట్

మీ ఆదాయం తక్కువగా ఉన్నప్పుడు, డబ్బు ఆదా చేయడానికి మీరు తీసుకోవలసిన ప్రాథమిక అంశాలలో పొదుపు లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ఒకటి. మీరు పొదుపు లక్ష్యానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడు, డబ్బు ఆదా చేయడం సులభం అవుతుంది. ఖర్చులను తగ్గించగల విషయాలను గుర్తించడానికి మీ ఆదాయం, ఖర్చులను ట్రాక్ చేయడం చాలా అవసరం. మీ ఆదాయ స్థాయితో సంబంధం లేకుండా నెలలో మొదటి రోజే బడ్జెట్‌ను సెట్ చేసుకుని దానికి కట్టుబడి ఉండండి. ఇది మీరు కిరాణా సామగ్రి, వ్యక్తిగత సంరక్షణ, బిల్లులు మొదలైన వాటిపై పరిమిత మొత్తాన్ని ఖర్చు చేయడానికి సహాయపడుతుంది.

## షేర్ చేసుకోండి

ప్రపంచవ్యాప్తంగా ఉన్న చాలా మందితో పోలిస్తే, ఇక్కడ ఒక వ్యక్తి.. తన నెలవారీ ఆహారం, ఇంటి అద్దె కోసం చేసే ఖర్చు సగటున ఎక్కువగానే ఉంటుంది. మీరు బ్యాచిలర్ అయితే, అద్దె ఇంటికి ఒకరికి బదులుగా ఇంకొక రూం మేట్‌ను తీసుకోండి. కలిసి ఉండడం, కలిసి వంట చేసుకోవడం లాంటి చర్యలు వల్ల డబ్బు, సమయం చాలా ఆదా అవుతాయి. మీరు అన్ని ముఖ్యమైన ఖర్చులను కవర్ చేసిన తర్వాత, సంపాదనలో కొంత భాగాన్ని పొదుపుగా పక్కన పెట్టండి. క్రమంగా మీ పొదుపును ఆదాయంలో 10% నుంచి 30% వరకు పెంచుకోండి.

## కొనుగోళ్లు, సేవలు

తెలివిగా ఖర్చు చేసే అలవాటును పెంపొందించుకోవడానికి అనవసరమైన ఖర్చులను తగ్గించుకోండి. ప్రతి వస్తువును కొత్తది కొనడానికి బదులుగా వాటిని అద్దెకు తీసుకోవచ్చు. లేదా సెకండ్ హ్యాండ్ వస్తువులను కొనండి. ప్రస్తుతం, తక్కువ ధరలకు వస్తువులను అందించే అనేక యాప్‌లు, అమ్మకాల సైట్‌లు ఉన్నాయి. వాటిని గుర్తించి, మంచి నాణ్యతతో కూడిన చౌకైన వస్తువులను ఎంచుకోండి. ఇది కాకుండా, మీకు ఇకపై అవసరం లేని సభ్యత్వాలు, సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌లను రద్దు చేయండి. ఇందులో జిమ్ సభ్యత్వం, స్ట్రీమింగ్ సేవలు, ఆన్‌లైన్ సభ్యత్వాలు వంటివి ఉండొచ్చు. వాటిని రద్దు చేయడం వల్ల మీరు డబ్బు ఆదా చేసుకుని పొదుపు లక్ష్యాన్ని పెంచుకోవచ్చు.

## ప్రయాణ ఖర్చులు

ప్రస్తుతం చాలా మందికి ప్రయాణాల ఖర్చులు చాలా భారమవుతుంటాయి. కాబట్టి, సాధ్యమైనంత వరకు తక్కువ దూర ప్రయాణానికి వ్యక్తిగత వాహనాన్ని ఉపయోగించండి. దూరపు ప్రాంతాలకు ప్రజా రవాణాను ఉపయోగించండి. ఇంకా మీ సహోద్యోగి మీ ఇంటి వద్దే నివాసం ఉంటుంటే ఇద్దరూ కలిసి ఒక వాహనం మీద వెళ్లి, ఖర్చులు షేర్ చేసుకోవచ్చు. మీకు సొంతంగా వాహనం లేకపోయినా సరే, ప్రస్తుతం వివిధ అప్లికేషన్స్.. చౌకైన ప్రయాణ ఎంపికలను, షేర్డ్ రైడ్‌లను అందిస్తున్నాయి. ఇలాంటి వాటిని ఉపయోగించుకోవడం వల్ల డబ్బు చాలా వరకు ఆదా చేసుకోవచ్చు. ఇంకా మీరు విహార యాత్రలు, పుణ్య క్షేత్రాల సందర్శన వంటివి చేయాలనుకున్నప్పుడు బృందంగా ఏర్పడి వెళ్లడం మేలు. దీనివల్ల ఖర్చులు చాలా వరకు తగ్గి డబ్బు ఆదా చేసుకోవచ్చు.





## బీమా

మీ కుటుంబానికి ఆరోగ్య బీమా, జీవిత బీమా లాంటి కవరేజీలతో రక్షణ కల్పించండి. బీమా పాలసీ తీసుకోవడం కూడా ముందస్తు ఆదా లాంటిదే. ఎందుకంటే, మీ ఆదాయం తక్కువ ఉన్నప్పుడు అనారోగ్యాలు కూడా తోడైతే అది మరింత ఖర్చు. తక్కువ ఆదాయం ఉన్న మీరు ఆసుపత్రి చికిత్సలకు అప్పులు చేయడం, మళ్లీ వాటిని తీర్చడం లాంటి విషయాలు మరింత ఇబ్బంది పెడతాయి. అందుచేత, మీరు ఆరోగ్య బీమా పాలసీని ముందుగానే కలిగి ఉంటే, మీకు మీ కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్యం విషయంలో భరోసా లభిస్తుంది. అధిక మెఎత్తంలో చేతి నుంచి డబ్బు ఖర్చు పెట్టకుండానే వైద్య చికిత్సలు చేయించుకుని ఖర్చుల నుంచి తప్పించుకోవచ్చు. అంతే కాకుండా ప్రతి కుటుంబంలోని సంపాదించే వ్యక్తికి టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ కూడా చాలా అవసరం. ఇది దురదృష్టకరమైన పరిస్థితుల్లో కుటుంబ యజమాని మరణించినప్పుడు మిగిలిన కుటుంబానికి ఎంతో ఆర్థిక భరోసానిస్తుంది. ముఖ్యంగా ఇది తక్కువ ఆదాయం గల కుటుంబాలకు సంపూర్ణ ఆర్థిక ప్రయోజనాన్నిస్తుంది. టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్రీమియం చాలా సరసమైంది. ఇది తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులకు కూడా చాలా అనువైంది.

## ఆటోమేట్ సేవింగ్స్

మీరు జీతం అందుకున్న వెంటనే రికరింగ్ డిపాజిట్, మ్యూచువల్ ఫండ్లు వంటి వివిధ పెట్టుబడి పథకాలకు ఆటోమేటిక్‌గా బ్యాంకు నుంచి డబ్బు బదిలీ అయ్యేటట్టుగా ముందుగానే మాండేట్ ఇవ్వడం మంచిది. మ్యూచువల్ ఫండ్లలో నెలవారీ %ాూ% లేదా రికరింగ్ డిపాజిట్లు వంటి పొదుపు పథకాలను ఎంచుకోవడం వల్ల మీరు ప్రతి నెలా రూ.100తో కూడా డబ్బు ఆదా చేయడం ప్రారంభించవచ్చు. తక్కువ ఆదాయం గలవారు ఇటువంటి వ్యూహాలను అమలు చేయడం వల్ల మీరు ప్రతి నెలా డబ్బు ఆదా చేసి భవిష్యత్తు లేదా అత్యవసర ఉపయోగం కోసం ఒక నిధిని సమకూర్చుకోవచ్చు. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు ల ద్వారా, మీరు స్టాక్స్, బాండ్లు, బంగారం మొదలైన వాటిలో చిన్న మొత్తాలను కూడా పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తిగా, మీరులో ఒక షేరును కొనుగోలు చేయడం ద్వారా చిన్న మొత్తంతో సేవింగ్స్‌ను ప్రారంభించవచ్చు.

# మరోమారు కలవరపెడుతున్న కోవిడ్

- రాజంపేటకు చెందిన వ్యక్తి కోవిడ్‌తో మృతి
- అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ



**తిరుపతి, జూలై 9 :** కోవిడ్ మరోమారు కలవరపెడుతోంది. కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి(52) కోవిడ్ కారణంగా చనిపోవడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల్లో ఆరా తీయగా కడప, తిరుపతి జిల్లాల్లో 5 కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు గుర్తించింది. దీంతో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రాష్ట్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు లేఖలు రాశారు. కోవిడ్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్లు, ఐసీయూ పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు, మందులు, ర్యాపిడ్ కిట్లు, అంబులెన్స్ వంటి వైద్య సిబ్బంది వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. ఇటీవల నమోదైన కేసుల నేపథ్యంలో అవసరమైతే వెంటనే చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులకు సూచించినట్లు సమాచారం.కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి (52) తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గత నెల 24న వేలూరు సీఎంసీలో చికిత్స నిమిత్తం చేరారు. నిమోనియా వ్యాధిని గుర్తించారు. అనుమానంతో కోవిడ్ పరీక్ష చేయగా 26వ తేదీ పాజిటివ్ వచ్చింది. చికిత్స పొందుతూ 28న మృతిచెందడంతో వైద్యశాఖ అప్రమత్త మైంది. కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంఈ ఆదేశించారు. రుయాలో కోవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటుచేశారు. కోవిడ్ టెస్ట్ కిట్లు, సిబ్బంది, అవసరమైన మందులతో సిద్ధంగా ఉన్నారు. రుయాలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదుకాలేదు. ప్రస్తుతం నమోదైన కేసుల్లో తీవ్రమైన లక్షణాలు లేవని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాం. కరోనాతో గతంలో లాగా భయపడాల్సిన పనిలేదు. వాతావరణంలో మార్పుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారు అశ్రద్ధ చేయకూడదు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



# ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన వల్ల నష్టపోయిన రాష్ట్రం

## రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

**మచిలీపట్నం, జూలై 9 :** గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. వైసీపీ అధినేత నుంచి చోటా నాయకుల వరకు అభివృద్ధికి ఆటంకాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు చేస్తున్న పసలేని విమర్శలను తాము పట్టించుకోబోమని తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బందరు మండలం కానూరు శివారు చిన్న క్యాంప్ బెల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హెడ్ వాటర్ ట్యాంక్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సంక్షేమం, అభివృద్ధి బాటలో ముందుకు సాగుతామని మంత్రి వెల్లడించారు. బందరు పట్టణంలో ఇప్పటికే ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్నామని, అదే రీతిలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రతి ఇంటికీ సురక్షిత జలాలు అందించేందుకు జలజీవన్ మిషన్ కింద రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంత రూపురేఖలను మార్చే ప్రతిష్ఠాత్మక బందరు పోర్టు పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది ఆరంభంలోనే ప్రారంభిస్తామని ప్రకటించారు. దీని ద్వారా మచిలీపట్నం ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టెకీ రాధాగాయత్రి మృతి కేసులో కీలక పరిణామం

## భర్త శ్రీచరణ్‌తో పాటు అత్తమామలకు నోటీసులు

**విశాఖపట్నం, జూలై 9 :** విజయనగరం జిల్లాకు చెందిన టెకీ రాధాగాయత్రి అనుమానాస్పద మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమె భర్త శ్రీచరణ్‌తో పాటు అతడి తల్లిదండ్రులు దుర్గాప్రసాద్, సీతామహాలక్ష్మిలకు ఉత్తరాఖండ్ పోలీసులు సమన్లు జారీ చేశారు. ఎఫ్ఐఆర్ నంబర్ 19/26 సెక్షన్ 103 బీఎన్ఎస్‌గా ఈ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. పుణెలో శ్రీచరణ్ పనిచేస్తున్న కార్యాలయానికి ఆయనకు చెందిన నోటీసులను పంపారు. మరోవైపు ఈ కేసులో విచారణ కొనసాగిస్తున్న మసూరీ సబ్ డివిజినల్ మేజిస్ట్రేట్ రాహుల్ ఆనంద్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఏమైనా చెప్పాలనుకుంటే మౌఖికంగా లేదా రాతపూర్వకంగా తెలపవచ్చని పేర్కొన్నారు. ఈనెల 17లోపు తమ వాంగ్మూలాలను సమర్పించాలని రాహుల్ ఆనంద్ సూచించారు.

# కర్ణాటకలో ఘోర ప్రమాదం..

## ఆరుగురి దుర్మరణం




**చిత్రదుర్గం, జూలై 9 :** కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ధార్వాడ నుంచి గురువారం తెల్లవారుజామున 9 మంది పర్యాటకులు వాహనంలో అంకోలా బయల్దేరారు. ఉత్తర కర్ణాటక జిల్లా ఎల్లాపుర పట్టణ శివారులోకి రాగానే వారు ప్రయాణిస్తున్న జీపు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# వైసిపి పాలనతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భయాందోళనలు
- అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేశాం
- దళారులతో పనిలేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు
- కులమత విద్వేషాలు రగిలించే వారిపట్ల జాగ్రతగా ఉండాల్సిందే
- బనగానిపల్లె సభలో సిఎం చంద్రబాబు నాయుడు



**నంద్యాల, జూలై 9 :** గత వైసిపి పాలకుల నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సీఎం చంద్రబాబు అన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్.. ప్రజల్లో భయాందోళనలు సృష్టించిందని విమర్శించారు. మాట వినని వారి భూములను 22ఏ జాబితాలో చేర్చారని వ్యాఖ్యానించారు. బనగానపల్లెలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆస్తిపై ప్రజలకే హక్కు ఉండాలని స్పష్టం చేసిన సీఎం.. భూమి ప్రజలదైతే పట్టా పుస్తకాలపై, భూమి సరిహద్దు రాళ్లపై గత ప్రభుత్వం తమ ఫొటోలు, పేర్లు ముద్రించడం సరైంది కాదన్నారు. ఫొటోల పిచ్చి పరాకాష్ఠకు చేరిందని విమర్శించారు. జగన్ ఫొటోలతో ఉన్న పాత పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేసి, ఇప్పుడు రాజముద్రతో పాస్‌పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు. రైతులకు పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి సమస్యనూ పరిష్కరించే బాధ్యత తమదేనని చెప్పారు. దళారీ వ్యవస్థకు తావు లేకుండా గ్రామసభల్లోనే పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా భూమికి సంబంధించిన పూర్తి వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపే బాధ్యత నాది. తిరుపతి జిల్లా శెట్టిపల్లిలో, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో 70 ఏళ్ల నాటి సమస్యలు పరిష్కరించాం. భూముల వివరాలన్నీ మీ సమక్షంలోనే పొందుపరుస్తున్నాం. దళారీ వ్యవస్థకు చోటు లేకుండా గ్రామసభల్లోనే పుస్తకాలిస్తున్నాం. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా చేయాలన్నదే మా లక్ష్యం. 6,887 గ్రామాల్లో సర్వే చేశాం.. 29,04,000 పాస్ పుస్తకాలిచ్చాం. క్యూఆర్ కోడ్‌లో రికార్డులన్నీ స్పష్టంగా ఉంటాయి. డోన్‌లో ఎన్నో ఏళ్లుగా వక్ఫ్ భూములు సాగు చేసుకుంటున్న 784 మంది రైతుల సమస్య పరిష్కరించాం అని వివరించారు. రౌడీలు, సంఘ విద్రోహ శక్తులను ఎవరూ ప్రోత్సహించవద్దు. కుల, మతాలను విభజించడానికి వీల్లేదు. రావణ్ అనే వ్యక్తి.. పురాణాలను దూషించాడు. రాముడు, సీతపై నీచంగా మాట్లాడాడు. తీవ్రవాదాన్ని, పాకిస్థాన్‌ను సమర్థించాడు. ఇలాంటి వాళ్లకు గొడ్డలిపార్టీ ఆర్థికసాయం చేసింది. రాష్ట్రంలో వింత ప్రవర్తన కలిగిన కొందరు వ్యక్తులున్నారు. ఆస్తి కోసం తల్లిని హింసిస్తున్నారు. ఓట్ల కోసం చనిపోయిన తండ్రికి పూజలు చేస్తున్నారు. తల్లిని గౌరవించలేని వ్యక్తి మనకు అవసరమా? తల్లులంటే గౌరవం ఉండాలనే.. తల్లికి వందనం తీసుకొచ్చా. గొడ్డలి పార్టీ.. విసుగు, విరామం లేకుండా కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. కులం, మతం, ప్రాంతాల వారీగా ముక్కలు చేసే కుట్రకు పాల్పడుతోంది. రాయలసీమలో ముఠాలు లేకుండా చేసింది తెదేపానే. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణగా ఉండాలి. ఆడబిడ్డలు స్వేచ్ఛగా తిరగాలి. మత విద్వేషాలు రెచ్చగొట్టడం, మనోభావాలు దెబ్బతీయడం మంచిదికాదు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరిరోజు అని మళ్లీ హెచ్చరిస్తున్నానని చంద్రబాబు అన్నారు. గ్రామసభలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. బనగానపల్లె.. బ్రహ్మంగారు నడయాడిన పవిత్ర ప్రాంతమని పేర్కొన్న ఆయన, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కంటే అరాచక పాలనే ఎక్కువగా కనిపించిందని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అనేక అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని మంత్రి విమర్శించారు. ఐదేళ్లలో రాయలసీమ కోసం వైసీపీ నేతలు ఏం చేశారో, తాము ఏం చేశామో ప్రజల సమక్షంలో చర్చకు రావాలని సవాల్ చేశారు. బనగానపల్లె బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రారంభిస్తే, వైసీపీ ప్రభుత్వం దానిని నిలిపివేసిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మళ్లీ తమ ప్రభుత్వం ఆ పనులను వేగవంతం చేసి బైపాస్ రోడ్డు నిర్మాణంలో 70 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే బనగానపల్లెలో 41 కిలోమీటర్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు. గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ వ్యవస్థను నిర్వీర్యం చేశారని బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

# కళాకారుల ఆరోగ్యం, సంక్షేమం కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత

- కళాకారులతో మాట్లాడినప్పుడు వారి ఆరోగ్య సమస్యలు గుర్తించా
- అందుకే వారి ఆరోగ్యం కోసం ఉచిత వైద్య చికిత్స ఏర్పాటు చేశా
- ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ వెల్లడి



**అమరావతి, జూలై 9 :** సంప్రదాయ కళలను పరిరక్షించడం అంటే వాటిని ప్రోత్సహించడం మాత్రమే కాదని, వాటిని జీవనాధారంగా చేసుకున్న కళాకారుల ఆరోగ్యం, సంక్షేమాన్ని కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో మాట్లాడిన సమయంలో వారు ఎదుర్కొంటున్న వృత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు తన దృష్టికి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో ఆత్మీయంగా మమేకమయ్యే అవకాశం లభించిందన్నారు. వారి అసాధారణ నైపుణ్యం, అపారమైన ఓర్పు, వృత్తిపట్ల ఉన్న అంకితభావం ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఏళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న కళాకారులు వెన్ను, మెడ, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తమ చేతుల మీద మోస్తున్న కళాకారుల ఆరోగ్యాన్ని కాపాడటం కూటమి ప్రభుత్వ బాధ్యత అని బలంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. కళాకారుల సమస్యలను తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి రాష్ట్రంలోని వివిధ హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సీతారాంపురం క్రోషే లేస్ కళాకారుల కోసం నిన్న(జులై 8న) వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించినట్లు పవన్ చెప్పారు. ఈరోజు(గురువారం)జులై 9న ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లి బొమ్మల కళాకారులు, కాకినాడ జిల్లాలోని ఉప్పాడ చేనేత కార్మికులు, కడప జిల్లాలోని మాధవరం చేనేత కార్మికులు, అనంతపురం జిల్లాలోని యాడికి చేనేత కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ÷ఎలై 10న విజయనగరం జిల్లాలోని బొబ్బిలి వీణ కళాకారులు, అనకాపల్లి జిల్లాలోని ఎటికొప్పాక కళాకారులు, ఏలూరు జిల్లాలోని హ్యాండ్ నాటెడ్ వూలెన్ పైల్ కార్పెట్ కళాకారులు, మదనపల్లె చేనేత కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే, జులై 11న సత్యసాయి జిల్లాలోని ధర్మవరం చేనేత కార్మికులు, శ్రీకాకుళం జిల్లాలోని బుడితి ఇత్తడి కళాకారులు, కృష్ణా జిల్లాలోని పెడన బ్లాక్ కలంకారీ కళాకారులు, తిరుపతి జిల్లాలోని చెక్క శిల్ప కళాకారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎపీలోని మరిన్ని హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ఇదే తరహాలో వైద్య శిబిరాలను దశలవారీగా కొనసాగిస్తామని పవన్ చెప్పారు. ఈ శిబిరాల ద్వారా సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన చోట నిపుణుల వైద్య సేవలు, నిర్ధారణ పరీక్షలు, తదుపరి చికిత్సకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి హస్తకళాకారుడు, ప్రతి చేనేత కార్మికుడు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'కళను గౌరవించడం అంటే కళాకారుడి శ్రమను గౌరవించడం. కళాకారుడి శ్రమను గౌరవించడం అంటే ఆయన ఆరోగ్యాన్ని కాపాడటం. కళాకారులు ఆరోగ్యంగా ఉంటేనే మన సంప్రదాయాలు, వారసత్వం భావితరాలకు సజీవంగా నిలుస్తాయి. కళను కాపాడాలంటే.. ముందు కళాకారుడిని కాపాడాలి' అని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రికార్డు

## వినూత్న సంస్కరణలతో రైతులకు మేలు

### పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,జూలై9 :** గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. ఖరీఫ్ నుంచి రైతు సేవా కేంద్రాల్లోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 90 శాతం ఏర్పాటు పూర్తవగా, ఖరీఫ్ నాటికి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# జోసెఫ్ రావణ్‌కు పోలీసుల షాక్

## బ్యాంక్ ఖాతాలను నిలిపివేస్తూ ఆదేశాలు

**కాకినాడ, జూలై 9 :** రెండేళ్లుగా యూట్యూబ్ వేదికగా విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న యూట్యూబర్ జోసఫ్ రావణ్ ఆర్థిక వనరులపై పోలీసులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఐసీఐసీఐ, యస్ బ్యాంకులకు కాకినాడ పోలీసులు అధికారికంగా లేఖలు రాశారు. పోలీసుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని పరిశీలించిన బ్యాంక్ యాజమాన్యాలు, అతని పేరున ఉన్న ఖాతాలను తక్షణమే నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. పోలీసుల ప్రాథమిక విచారణలో జోసఫ్ రావణ్ ఆర్థిక వనరులకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'ప్రశ్న' అనే వెబ్‌సైట్‌లో ఈ వివాదాస్పద వీడియోలను పోస్ట్ చేయడం ద్వారా అతను నెలకు రూ. 1.50 లక్షలకు పైగా ఆదాయం గడిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల్లో ద్వేషాన్ని రేకెత్తించే కంటెంట్ ద్వారానే ఈ సంపాదన వస్తున్నట్లు తేలింది. కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు.. ఈ నెల 2వ తేదీన రావణ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్‌ను తదుపరి విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఈ÷ఊఎ) పంపించారు. ప్రస్తుతం అతని ఫోన్‌లో నిక్షిప్తమై ఉన్న వివాదాస్పద వీడియోలు, డిలీట్ చేసిన డేటాతో పాటు వాట్సాప్ చాటింగ్‌లపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. అతని వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# జ్ఞానేశ్వరి కోసం ముమ్మర గాలింపు


## కొండప్రాంతంలో మళ్లీ ముమ్మరంగా తనిఖీ

**కాకినాడ, జూలై 9 :** కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన కేసులో మరోసారి గాలింపు చర్యలు వేగవంతమయ్యాయి. జూన్ 6వ తేదీన అదృశ్యమైన చిన్నారి ఆచూకీ కోసం అధికారులు విస్తృత స్థాయిలో శోధిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారి ఇంటి వెనుక ఉన్న కొండ ప్రాంతంలో మళ్లీ గాలింపు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉన్న స్థానికుల సహకారంతో అధికారులు శోధిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సీహెచ్ అగ్రహారం గ్రామాన్ని సందర్శించి జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందని భరోసా ఇచ్చారు. చిన్నారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, గాలింపు చర్యలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయంలో కుటుంబానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. చిన్నారి జ్ఞానేశ్వరి కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. ఈ కేసును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తున్నామని చెప్పుకొచ్చారు. గాలింపు చర్యలు ఆగకుండా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. చిన్నారి ఆచూకీ లభించే వరకు అన్ని అవకాశాలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు. జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు జిల్లాలో తీవ్ర ఆందోళనకు కారణమైంది. చిన్నారి క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజలు కూడా కోరుకుంటున్నారు. ఈ కేసులో జరుగుతున్న ప్రతి పరిణామంపై అధికారులు నిశితంగా నిఘా ఉంచి చర్యలు చేపడుతున్నారు.

# స్థిరంగా బంగారం ధరలు



**హైదరాబాద్, జూలై 9 :** అంతర్జాతీయ భౌగోళిక కారణాల నేపథ్యంలో బంగారం ధరలు క్రమంగా తగ్గుదల నమోదు చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,43,120గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,31,190గా ఉంది.మరోవైపు వెండి ధరల్లో కూడా స్వల్ప తగ్గుదల నమోదైంది. కిలోకు వంద రూపాయల మేర తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,44,900గా ఉంది.




## నాలుగో టీ20లో ఇంగ్లాండ్ విజయం

### సిరీస్‌ను కోల్పోయిన భారత్



**బ్రిస్టల్:** టీ20ల్లో ప్రపంచ ఛాంపియన్‌గా ఉన్న భారత్‌కు మరో షాక్. మొన్న ఐర్లాండ్ చేతిలో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఒక్క మ్యాచ్ గెలవకుండా ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్న టీమ్‌ఇండియా.. ఇప్పుడు ఇంగ్లాండ్‌పై కూడా సిరీస్‌ను కోల్పోయింది. భారత్‌తో జరిగిన నాలుగో టీ20లో ఇంగ్లాండ్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆతిథ్య జట్టు ఐదు టీ20ల సిరీస్‌ను 3–0తో ఒక మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 13.5 ఓవర్లలోనే ఒకే వికెట్ కోల్పోయి ఛేదించింది. జోస్ బట్లర్ (8) త్వరగానే ఔటైనా.. తర్వాత



వచ్చిన హ్యారీ బ్రూక్ (79; 35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సులు) చెలరేగాడు. ఫిల్ సాల్ట్ (59; 42 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. టీమ్‌ఇండియా బ్యాటర్లలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (80లి; 49 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులు) ఒక్కడే రాణించాడు. వైభవ్ సూర్యవంశీ (15), అభిషేక్ శర్మ (16), శివమ్ దూబె (22), తిలక్ వర్మ (11), ఇషాన్ కిషన్ (4) నిరాశపర్చారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 2, జోఫ్రా ఆర్చర్ 2, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ ఒక్కో వికెట్ పడగొట్టారు. నామమాత్రపు ఐదో టీ20 శనివారం సౌథాంప్టన్‌లో జరగనుంది. భారత్‌తో రెండు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌లు ఉన్న ద్వైపాక్షిక టీ20 సిరీస్‌ను ఇంగ్లాండ్ కైవసం చేసుకోవడం ఇదే తొలిసారి.

## క్వాలిఫయర్-2కు కరీంనగర్ డైమండ్స్

**హైదరాబాద్:** టీజీ20 లీగ్ 2026లో కరీంనగర్ డైమండ్స్ క్వాలిఫయర్–2కు అర్హత సాధించింది. గురువారం రంగారెడ్డి రైజర్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కరీంనగర్ 75 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో రంగారెడ్డి 16.3 ఓవర్లకు 163 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్, ఓపెనర్ తనయ్ త్యాగరాజన్ (63; 33 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులు), నితిన్ సాయి యాదవ్ (50; 30 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ శతకాలు చేశారు. మిగతా బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. కరీంనగర్ బౌలర్లలో ఆశిశ్ శ్రీవాత్సవ (5/16) అద్భుతమైన ప్రదర్శన చేశాడు. శుభమ్ శర్మ 2, నారాయణ తేజ, సతీశ్ కుమార్, దినేశ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. నేడు క్వాలిఫయర్–1 హైదరాబాద్ ఈ–ఛాంపియన్స్, ఖమ్మం ఏఎస్



తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టుతో కరీంనగర్ రేపు క్వాలిఫయర్–2 ఆడనుంది.

## టాప్ ఆర్డర్‌లోనే సంజూకు అవకాశాలు ఇవ్వాలి

### మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా టీమ్ సూచన

ఇంగ్లాండ్‌తో బ్రిస్టల్ వేదికగా జరగబోయే నాలుగో టీ20 మ్యాచ్‌కు ముందు భారత జట్టు సెలెక్షన్, బ్యాటింగ్ ఆర్డర్‌పై మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటర్ ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పష్టమైన అభిప్రాయాలను పంచుకున్నారు. స్టార్ ప్లేయర్ సంజూ శాంసన్ పట్ల టీమ్ మేనేజ్‌మెంట్ ప్రవర్తిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. జట్టులో మార్పులు చేయాల్సి వస్తే మొదట సంజూ శాంసన్‌నే పక్కన పెట్టడం లేదా బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకు నెట్టడం ఒక అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేఎల్ రాహుల్ విషయంలో కూడా ఇలాగే చేశారని, ఇప్పుడు సంజూను కూడా అదే విధంగా ట్రీట్ చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదని గంభీర్, శ్రేయస్ అయ్యర్ లూప్‌కు ఆకాశ్ చోప్రా సూచించారు.మొదటి టీ20 తర్వాత గత రెండు మ్యాచ్‌లుగా సంజూ శాంసన్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కలేదు. ఓపెనర్లుగా వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మలు బరిలోకి దిగుతుండటంతో సంజూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీనిపై ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. "ఒకవేళ మీరు నాలుగో మ్యాచ్‌లో సంజూను జట్టులోకి తెచ్చినా, ప్రస్తుత బ్యాటింగ్ ఆర్డర్ ప్రకారం అతనిని ఎక్కడ ఆడిస్తారు? వైభవ్, అభిషేక్ ఓపెనింగ్ చేసి, ఈషాన్ కిషన్ నెంబర్ 3లో, శ్రేయస్ అయ్యర్ నెంబర్ 4లో వస్తే.. కేవలం కుడిచేతి వాటం బ్యాటర్ కావాలనే కారణంతో సంజూ శాంసన్‌ను నెంబర్ 5 పొజిషన్‌లో ఆడించడం సరైన నిర్ణయం కాదు. అసలు ఇందులో సంజూ చేసిన తప్పేంటి? జట్టులో ఎవరినైనా తీసేయాలంటే మొదట గుర్తొచ్చేది అతనే, అలాగే బ్యాటింగ్ ఆర్డర్ మార్చాలన్నా బలయ్యేది అతనే. నేను ఎప్పుడు సంజూను ఆడించినా మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా ఆడించను, అతని కోసం ఓపెనింగ్ స్థానాన్ని ఖాళీ చేస్తాను. ఎందుకంటే అతను అక్కడే బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇవ్వగలడు" అని స్పష్టం చేశారు.గణాంకాల పరంగా చూసినా సంజూ శాంసన్‌ను టాప్ ఆర్డర్‌లోనే ఆడించాలని ఆకాశ్ చోప్రా గుర్తు చేశారు. సంజూ శాంసన్ తన కెరీర్‌లో ఆడిన



57 టీ20 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లలో కేవలం 10 సార్లు మాత్రమే నెంబర్ 5 లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆ మ్యాచ్‌లలో అతని యావరేజ్ కేవలం 21.13 గా మాత్రమే ఉంది. మొత్తం మీద ఆ పొజిషన్‌లో అతను చేసిన పరుగులు 169 మాత్రమే. దీనిని బట్టి చూస్తే లోయర్ మిడిల్ ఆర్డర్ అనేది సంజూ శాంసన్ శైలికి సరిపోదని, అతనికి ఓపెనింగ్‌లోనే ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని ఆకాశ్ చోప్రా డిమాండ్ చేశారు.ఇదే సమయంలో జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ఫామ్‌పై వస్తున్న విమర్శలను ఆకాశ్ చోప్రా కొట్టిపారేశారు. సంజూ శాంసన్ కోసం తిలక్ వర్మను పక్కన పెట్టాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. "తిలక్ వర్మ మన జట్టుకు వైస్ కెప్టెన్. ఈ సిరీస్‌లో అతని ప్రదర్శన అంత ఘోరంగా ఏమీ లేదు. గత నాలుగు మ్యాచ్‌లను గమనిస్తే అతనికి వచ్చిన అవకాశాలు చాలా తక్కువ. ప్రస్తుతం అతను బ్యాటింగ్ చేస్తున్న పొజిషన్ చాలా కఠినమైనది. అలాంటి స్థానంలో ప్రతి మ్యాచ్‌లోనూ స్థిరంగా రాణించడం ఎవరికైనా కష్టమే.



## టీజీ20 లీగ్..
## ఫైనల్‌కు చేరిన ఖమ్మం ఏసెస్

**హైదరాబాద్:** అన్విత ఖమ్మం ఏసెస్ జట్టు టీజీ20 లీగ్ ఫైనల్‌కు చేరింది. హైదరాబాద్ ఈ–ఛాంపియన్స్‌తో జరిగిన క్వాలిఫయర్–1 మ్యాచ్‌లో ఖమ్మం 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం 200/6 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 190/8 స్కోరుకు పరిమితమైంది. ఓపెనర్ సాయివికాస్ రెడ్డి (69; 27 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సులు) మెరుపులు మెరిపించాడు. మిగతా బ్యాటర్లు భారీ స్కోర్లు చేయలేకపోయారు. గడుగు గణేశ్ (27), ప్రణవ్ వర్మ (26), వైష్ణవ్ రెడ్డి (21), అన్విత్ రెడ్డి (16), అజయ్ దేవ్ గౌడ్ (13) పరుగులు చేశారు. ఖమ్మం బౌలర్లలో సహేంద్ర మల్లు 3, వేద్‌రెడ్డి 2, హర్షిత్, విద్యానందరెడ్డి, సీవీ మిలింద్ తలో వికెట్ తీశారు. శుక్రవారం జరిగే క్వాలిఫయర్–2లో హైదరాబాద్ ఈ–ఛాంపియన్స్, కరీంనగర్ డైమండ్స్ తలపడనున్నాయి. ఆ మ్యాచ్‌లో గెలిచే జట్టుతో ఆదివారం ఖమ్మం ఫైనల్ ఆడుతుంది. తొలుత ఖమ్మం బ్యాటర్లలో ఐదో స్థానంలో వచ్చిన మికిల్ జైస్వాల్ (76; 34 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సులు) అర్ధ శతకంతో మెరిశాడు. జీఎస్‌కే రెడ్డి (40; 30 బంతుల్లో), పరాస్ రాజ్ (32; 18 బంతుల్లో) రాణించారు. ప్రతీక్ రెడ్డి (18), సీవీ మిలింద్ (17) పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్లలో అఖిల్ రాథోడ్ 2, దేవ్ మెహతా, షణ్ముఖ అశ్విన్, ప్రణవ్ వర్మ, అజయ్ దేవ్ గౌడ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



## స్టోక్స్ రిటైర్మెంట్ వీడియోపై ఐసీసీ సీరియస్

మ్యాచ్ జరుగుతుండగా, డ్రెస్సింగ్ రూమ్‌లో రికార్డు చేసిన వీడియోను రిలీజ్ చేయడం పట్ల ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై వెంటనే వివరణ ఇవ్వాలని ఇంగ్లాండ్, వెల్స్ క్రికెట్ బోర్డును కోరింది. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు జరుగుతుండగా ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఈసీబీ విడుదల చేయడంపై వివాదం చెలరేగింది. అంతర్జాతీయ క్రికెట్‌కు హఠాత్తుగా వీడ్కోలు పలికి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశాడు బెన్ స్టోక్స్ . ట్రెంట్ బ్రిడ్జ్‌లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్ మధ్య మూడో టెస్టు 4వ రోజు బెన్ స్టోక్స్ వీడ్కోలు వార్త బయటకొచ్చింది. ఆ రోజు ఆట మొదలవ్వడానికి ముందే డ్రెస్సింగ్ రూమ్‌లో స్టోక్స్ తనకు కెప్టెన్‌గా, ఆటగాడిగా ఇదే చివరి మ్యాచ్ అని సహచరులకు చెప్పాడు. అతడు తన వీడ్కోలు గురించి వెల్లడిస్తుండగా ఇంగ్లాండ్, వేల్స్ క్రికెట్ బోర్డు మీడియా బృందం ఆ దృశ్యాలను రికార్డు చేసింది. అదేరోజు టీ బ్రేక్ సమయంలో సోషల్ మీడియాలో, టీవీ ఛానెళ్లలో స్టోక్స్ రిటైర్మెంట్ వార్త వెలుగులోకి వచ్చింది. ఇక మ్యాచ్ జరుగుతుండగానే స్టోక్స్ వీడ్కోలు వీడియో బయటకు రావడంపై ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆటగాడు, మ్యాచ్ అధికారులకు సంబంధించిన (పీఎంఓఏ) నిబంధలన ప్రకారం బెన్ స్టోక్స్ ఉల్లంఘనకు పాల్పడ్డాడని, ఈసీబీ కూడా ఇందులో హద్దు మీరిందని ఐసీసీ పేర్కొంది. పీఎంఓఏ నిబంధల ప్రకారం, మ్యాచ్ సమయంలో.. డ్రెస్సింగ్ రూమ్‌లో ఇలాంటివి రికార్డు చేయకూడదు. దీన్ని అతిక్రమణగా తేల్చిన ఐసీసీ.. దీనిపై వివరణ ఇవ్వాలని ఈసీబీకి నోటీసులు పంపింది. మరోవైపు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్.. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు నోటీసులు పంపడంపై బెన్ స్టోక్స్ సెటైర్ వేశాడు. దీనిపై సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. 'అతడిపై వేటు వేయండి' అని ట్వీట్ చేశాడు. ఇక ఈ వివాదంపై ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం.




## ఇ-20 పెట్రోలుతో వాహనాలు పాడుకావు

దిల్లీ: ఇ–20 పెట్రోలు (80% పెట్రోలుం 20% ఇథనాల్)తో వాహన ఇంజిన్ పాడవుతుందని, కీటకాలను ఆకర్షిస్తుందని, బీమా వర్తించదని వస్తున్న వాదనలను ఇండియన్ షుగర్ అండ్ బయో–ఎనర్జీ మ్యాన్‌ఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎస్‌ఎంఏ) తోసిపుచ్చింది. ఆ వాదనలు పూర్తిగా తప్పుదోవ పట్టించేవేనని, ఇ–20 పేరుతో పెట్రోలులో నేరుగా చెరకు రసం కలుపుతారనే దానిలో నిజం లేదని స్పష్టం చేసింది. శాస్త్రీయ ఆధారాలు, ధ్రువీకరించిన గణాంకాలు, అధికారిక వివరణల ద్వారానే ఇథనాల్ కలిపిన పెట్రోలుపై చర్చ జరగాలని కోరింది. చమురు మార్కెటింగ్ కంపెనీలు, వాహన తయారీదార్లు, ఇంధన పరీక్షా సంస్థలు, ఇతర భాగస్వాములతో సంప్రదింపుల ద్వారా శాస్త్రీయంగా ధ్రువీకరించి, కఠిన ప్రమాణాలతో పరీక్షించి, నిరంతర పర్యవేక్షణ మధ్య పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమ కార్యక్రమాన్ని భారత్ ముందుకు తీసుకెళ్తోందని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇ–20 పెట్రోలు కారణంగా ఇంజిన్ వైఫల్యం లేదా వాహనం ఆగిపోవడం లాంటి ఒక్క సంఘటన కూడా ఇప్పటివరకు చోటుచేసుకోలేదని వెల్లడించింది. ఊహాగానాలు, తప్పుడు సమాచారం వల్లే వాహనాలు పాడవుతున్నాయనే ఆందోళనలు రేగుతున్నట్లు ఐఎస్‌ఎంఏ తెలిపింది. వాహన మైలేజీ తగ్గడం కూడా చాలా స్వల్పంగానే ఉంటుందని పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. కర్బన ఉద్గారాలు అదుపు చేయడం, చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు, విదేశీ మారకపు ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు, రైతుల ఆదాయాలకు మద్దతు ఇచ్చేందుకు ఇ–20 వినియోగం ఉపకరిస్తుందని వివరించారు.



## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. బుధవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో భారీ నష్టాలను మూటగట్టుకున్న సూచీలు.. నేడు కోలుకున్నాయి. ముఖ్యంగా రియాలిటీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, పీఎస్‌యూ బ్యాంక్ స్టాక్స్ రాణించడం సూచీలకు కలిసొచ్చింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్, నిఫ్టీ మిడ్‌క్యాప్ షేర్లు ఒకటిన్నర శాతం మేర రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 76,576.14 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,503.60) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో దాదాపు 800 పాయింట్ల లాభంతో 77,326.65 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 238.22 పాయింట్ల లాభంతో 76,741.82 వద్ద ముగిసింది. నిఫ్టీ 80.75 పాయింట్ల లాభంతో 23,962.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.40గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండిగో, ఎటర్నల్ షేర్లు రాణించాయి. ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 78.10 డాలర్లుగా ఉండగా.. బంగారం 4104 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## మధుమేహులకు గుడ్‌న్యూస్..

### ఇక వారానికోసారే ఇన్సులిన్

**న్యూఢిల్లీ :** మధుమేహంతో బాధపడుతున్నవారికి ప్రముఖ ఫార్మా దిగ్గజం నోవో నోర్డిస్క్ గుడ్‌న్యూస్ చెప్పింది. రోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకొనే బాధను తప్పిస్తూ.. 'అవిక్లీ' పేరిట వారానికోమారు తీసుకునే ఇన్సులిన్ ఇంజెక్షన్‌ను తీసుకొచ్చింది. 700 యూనిట్స్, 2,100 యూనిట్స్ ఇంజెక్షన్ పెన్ ఆప్షన్లతో దేశీయంగా విడుదల చేసింది. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.3.73 ఉంటుందని నోర్డిస్క్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విక్రాంత్ శ్రోత్రియా వెల్లడించారు. సాధారణంగా డయాబెటిస్‌తో బాధపడేవారు ప్రతిరోజూ ఇంజెక్షన్ తీసుకోవాల్సి ఉంటుందని విక్రాంత్ అన్నారు. దీంతో రోజూ, జీవితాంతం తీసుకోవాలన్న కారణంతో చాలా మంది.. పూర్తిగా ఇన్సులిన్‌ను తీసుకోవడానికే నిరాకరిస్తుంటారని చెప్పారు. అవిక్లీ ఆ ఇబ్బందులను తొలగిస్తుందన్నారు. మధుమేహులకు వారానికోసారి తీసుకునే వెసులుబాటు లభించడంతో పాటు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న బేసల్ ఇన్సులిన్ కంటే మెరుగ్గా పనిచేస్తుందని తెలిపారు. దీనివల్ల ఏడాదిలో 365 సార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సిన చోట.. 52 సార్లు తీసుకుంటే సరిపోతుందని చెప్పారు. దేశంలోని 4,500 మంది డిస్ట్రిబ్యూటర్ల ద్వారా ఈ ఇంజెక్షన్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు విక్రాంత్ వెల్లడించారు. టైప్–1, టైప్–2 డయాబెటిస్ పేషెంట్లు దీన్ని తీసుకోవచ్చున్నారు. ఇన్సులిన్ తీసుకోవడాన్ని సులభతరం చేయడం నోవో నోర్డిస్క్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. దేశంలో సుమారు 10 కోట్ల మంది మధుమమేహులు ఉన్నారని, చాలా మందిలో ఉండే సైకలాజికల్‌గా, భౌతికంగా ఉండే ఇబ్బందులను అవిక్లీ తొలగిస్తుందన్నారు. భారత్‌లో విడుదల చేయడం ద్వారా మొత్తం ఏడు దేశాల్లో ఈ ఔషధాన్ని అందుబాటులోకి తెచ్చినట్లయ్యిందని విక్రాంత్ వెల్లడించారు.



## నేడు లెనిన్ విడుదల

ఈ నెల రెండో శుక్రవారం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చిత్రాల సందడి నెలకొనబోతోంది. ఈ వారం టాలీవుడ్ నుంచి అఖిల్ అక్కినేని మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'లెనిన్' నేరుగా థియేటర్లలోకి వస్తుండగా, దీనికి పోటీగా భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలు కూడా రేసులో నిలిచాయి. ఇక వైవిధ్యమైన కథాంశాలతో, విభిన్న జోనర్లలో ప్రేక్షకులను అలరించేందుకు ఆసక్తికరమైన చిత్రాలు విడుదలవుతున్నాయి. అఖిల్ అక్కినేని కెరీర్‌లోనే అత్యంత రగ్గడ్ లుక్‌లో కనిపించనున్న యాక్షన్ డ్రామా 'లెనిన్'. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఒక అందమైన ప్రేమకథ హింసాత్మక మలుపులు తిరిగితే ఎలా ఉంటుందనే కథాంశంతో వస్తున్న ఈ సినిమాను నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. థమన్ ఎస్ దీనికి సంగీతం అందించారు.

## మరో సస్పెన్స్ థ్రిల్లర్... వదల

సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదల' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను గమనిస్తే, మొదట ఒక సాధారణ కుటుంబ కథలా సినిమా ప్రారంభమవుతుంది. ఇరవై ఏళ్లుగా సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులుగా జగపతిబాబు, లయ కనిపిస్తారు. ఒకరిపై ఒకరికి అపారమైన ప్రేమ, ఆప్యాయతతో జీవిస్తున్న వారి జీవితంలోకి అనూహ్యంగా ఓ యువతి ప్రవేశించడం కథను పూర్తిగా మలుపుతిప్పుతుంది. పక్కింటికి వచ్చిన ఆ యువతి జగపతిబాబు పాత్రపై ప్రమాదకరమైన స్థాయిలో మోజు పెంచుకోవడం, క్రమంగా అది వ్యామోహంగా మారడం ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. అదే సమయంలో లయ పాత్రకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం, కుటుంబంపై ముప్పు పెరగడం కథలోని సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది.




# వర్షంలో 12 గంటలపాటు
# ఏకబిగిన చిరు షూటింగ్

## మైసా కోసం అండర్ వాటర్‌లో రష్మిక సాహసం

ప్రేక్షకులను అలరించడం కోసం నటీనటులు ఎంత కష్టాన్నైనా భరిస్తారు. పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకుంటారు. ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో చిరంజీవి హీరోగా రానున్న మెగా 158 ఒకటైతే.. రష్మిక ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'మైసా' మరొకటి. ఈ చిత్రాల కోసం అటు చిరు.. ఇటు రష్మిక ఎంతో కష్టపడుతున్నారు. తాజాగా ఈ రెండు సినిమాల అప్‌డేట్స్‌ను ఆయా చిత్రబృందాలు పంచుకున్నాయి. మెగా 158లో వర్షంలో సీక్వెన్స్ కోసం చిరంజీవి 12 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేయగా.. 'మైసా' కోసం రష్మిక అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో మెగా158 (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఉదయం 4 గంటలకు వ్యాయామంతో తన రోజును ప్రారంభించే చిరంజీవి నిబద్ధత చూసి మా చిత్రబృందం ఆశ్చర్యపోయింది. అత్యంత కఠినమైన యాక్షన్ సన్నివేశాలను షూట్ చేయడం కోసం 12 గంటలు పట్టింది. వర్షంలో ఉండే ఈ సన్నివేశాన్ని చిరు ఎంతో కష్టపడి పూర్తి చేశారు. అందుకే ఆయన మెగాస్టార్ అయ్యారు అని టీమ్ పోస్ట్ చేసింది.'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె.. గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. తాజాగా అండర్




వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. సినిమాలో ఈ సన్నివేశం చాలా ఆసక్తిగా ఉంటుందని టీమ్ వెల్లడించింది. ఈ చిత్రం కోసం



అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందారు.



## భారీ బడ్జెట్ చిత్రంగా టాక్సిక్



కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యశ్ ప్రస్తుతం నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్'. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొల్పింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నారు. సినిమా నిర్మాణ వ్యయం దాదాపు రూ.500 కోట్లకు పైగా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యాక్షన్, హింసాత్మక నేపథ్యం, భారీ విజువల్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన రెండు గ్లింప్స్‌తో పాటు ఒక పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా బడ్జెట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రచారం ప్రకారం, మొత్తం బ్జడెట్‌లో దాదాపు రూ.100 కోట్లు ప్రధాన తారాగణం, దర్శకురాలు, కీలక సాంకేతిక నిపుణుల రెమ్యూనరేషన్లకే వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. హీరో యశ్ ఈ సినిమా కోసం సుమారు రూ.50 కోట్ల పారితోషికం తీసుకుంటున్నారని, అంతేకాకుండా సినిమా లాభాల్లో కూడా వాటా ఉండేలా ఒప్పందం చేసుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీకి సుమారు రూ.15 కోట్లు పారితోషికంగా అందుతున్నట్లు సమాచారం. కీలక పాత్రలో కనిపించనున్న నయనతారకు రూ.12 కోట్లు, మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్న రుక్మిణి వసంత్‌కి రూ.3 కోట్లు ఇస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే తారా సుతారియా, హ్యూమా ఖురేషిలకు చెరో రూ.2 కోట్ల వరకు పారితోషికం చెల్లిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

## జన నాయగన్ విడుదలకు సిద్ధం

విజయ్ 'జన నాయగన్' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.



## నా ఇన్‌స్టా సబ్‌స్క్రైబ్ చేసుకోవద్దు

### నటి పాయల్ రాజ్ పుత్

కొన్ని రోజులుగా సెలబ్రిటీల ఇన్‌స్టా సబ్‌స్క్రిప్షన్ హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. తాజాగా నటి పాయల్ రాజ్ పుత్ కూడా తన అకౌంట్‌కు సబ్‌స్క్రిప్షన్ పెట్టారు. దీంతో ఆమెను కొందరు ట్రోల్ చేశారు. వారికి సమాధానమిస్తూ పాయల్ పోస్ట్ చేశారు. తన సబ్‌స్క్రిప్షన్ ఛానల్‌లో ఎలాంటి కంటెంట్ ఉండనుందో స్పష్టం చేశారు. 'హాట్ పిక్స్', బోల్డ్ కంటెంట్ కోసం ఆశించే వారెవరూ తన ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవద్దని చెప్పారు. "నా ఛానల్‌లో నేను ఎలాంటి కంటెంట్ షేర్ చేయబోతున్నాననే దానిపై చాలా మంది మెసేజ్‌లు చేస్తున్నారు. నేను ఒక విషయం చాలా స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. ఒకవేళ మీరు బోల్డ్ కంటెంట్ ఆశించి సబ్‌స్క్రైబ్ చేసుకోవాలనుకుంటే.. మీకు ఇది సరైన ఛానల్ కాదు. తెర వెనుక ఉండే నా నిజమైన జీవితాన్ని చూడాలనుకునే వాళ్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ చేసుకోండి. నా వ్యక్తిగత పరిధిని గౌరవిస్తున్నందుకు ధన్యవాదాలు" అని పాయల్ పేర్కొన్నారు. ఇందులో తన అభిప్రాయాలు మాత్రమే ఉంటాయని.. అంతకు మించి మరేమీ ఆశించవద్దని ఆమె స్పష్టం చేశారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com